దక్షిణాది పొగాకు మార్కెట్ తిరగోమనంలో నడుస్తోంది. గత నెలలో కొద్దిరోజులపాటు ఒకింత పోటీపడి ధరలు పెంచిన వ్యాపారులు తిరిగి వాటిని తగ్గించేశారు. పది రోజుల్లోనే కిలోకు సుమారు రూ.30 మేర గరిష్ఠ ధరలు పడిపోయాయి. ఇంకా తగ్గే అవకాశం ఉందన్న సంకేతాలు వ్యాపారుల నుంచి వస్తున్నాయి. ఇప్పటికే తీవ్రంగా నష్టపోతున్న తాము గరిష్ఠ ధరలు మరింత పతనమైతే అప్పులు మూటకట్టుకోక తప్పదని రైతులు వాపోతున్నారు. రైతులు పండించిన మొత్తం పంటలో ఇప్పటి వరకూ 75శాతం వ్యాపారులు కొనుగోలు చేసినట్లు అంచనా. ఇంకా రైతుల వద్ద 25శాతం వరకూ ఉంది. ఈ సమయంలో ధరలు పెంచి కొనుగోలు చేయాల్సిన వ్యాపారులు అందుకు భిన్నంగా క్రమంగా తగ్గించి వేస్తుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పొగాకు మార్కెట్ తిరోగమనం

- పది రోజుల్లో కిలో రూ.346నుంచి రూ.315కు దిగజారిన గరిష్ఠ ధర
- ఇంకా తగ్గితే తీవ్రంగా నష్టపోతామని రైతుల ఆవేదన
- ఇళ్లలోనే నాల్గోవంతు పంట
- వచ్చేనెల 15వరకు వేలం సాగే అవకాశం
- ధరల కన్నా కొనుగోళ్ల పూర్తిపై బోర్డు దృష్టి





ఒంగోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రత్యేకించి దక్షిణాదిలో గత రెండు సీజన్‌లు పొగాకుకు ఊహించని స్థాయిలో ధరలు లభించాయి. కారణాలు ఏమైనా పంట నాణ్యతను కూడా పట్టించుకోకుండా భారీగా ధరలు ఇచ్చి వ్యాపారులు కొనుగోలు చేశారు. అలా 2022-23 సీజన్‌లో సగటున కిలోకు రూ.237, 2023-24లో సగటున కిలోకు రూ.267 ధర లభించింది. ఒక రకంగా డిమాండ్, సప్లయ్ సూత్రానికి భిన్నంగా మార్కెట్ నడిచింది. పంట ఉత్పత్తి అనుమతించిన దాని కన్నా ఎక్కువ జరిగినప్పటికీ వ్యాపారులు అధిక ధరలను ఇచ్చి కొనుగోలు చేశారు. దీంతో 2024-25 సీజన్ (ప్రస్తుత కొనుగోలు జరుగుతున్న)లో దక్షిణాది ప్రాంత రైతులు భారీ పెట్టుబడులు పెట్టి పొగాకు సాగు చేశారు.

గతంతో పోల్చితే సగటున ఒక్కో బ్యారన్‌కు రూ.4 లక్షల వరకు అదనంగా ఖర్చు చేశారు. పంట ఉత్పత్తి కూడా అధికంగానే జరిగింది.

పట్టించుకోని బోర్డు అధికారులు

పొగాకు బోర్డు అధికారులు మాత్రం ధరల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే వేలం ప్రారంభించి దాదాపు ఏడు మాసాలు గడుస్తుండగా ఇంకా నాల్గో వంతు పంట రైతుల వద్దనే ఉంది. ఈ మొత్తం కొనుగోలుకు మరో నెలన్నర పట్టే అవకాశం కనిపిస్తోంది. దీంతో ధరల సంగతి ఎలా ఉన్నా వీలైనంత త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో బోర్డు అధికారులు వ్యాపారులపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితితో ఈ ఏడాది అప్పులు మూటకట్టుకోకతప్పదని రైతులు వాపోతున్నారు.

55 మిలియన్ కిలోలు అధికంగా పంట ఉత్పత్తి

దక్షిణాదిలోని 11వేలం కేంద్రాలలో 2024-25 సీజన్‌కు 105 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. రైతులు ఇంచుమించు 160 మిలియన్ కిలోలు పండించినట్లు అంచనా. ఈ ఏడాది మార్చి 10న పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు సుమారు 118 మిలియన్ కిలోలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. సగటున కిలోకు రూ.230 మేర ధర లభించింది. తొలుత కిలోకు గరిష్ఠంగా రూ.280 ఇచ్చిన వ్యాపారులు దాదాపు ఆగస్టు ఆఖరు వరకు అదే ధరను కొనసాగించారు. ఆతర్వాత ఒక్కసారిగా గరిష్ఠ ధర కిలోను రూ.300 చేసి క్రమంగా పెంచుతూ సెప్టెంబరు రెండో పక్షం నాటికి రూ.346కు తీసుకెళ్లారు. దీంతో రైతులు ఒకింత ఆనందం వ్యక్తం చేశారు. మేలురకం బేళ్లను అధికంగా వేలం కేంద్రాలకు తెచ్చారు. అయితే పది రోజులు మాత్రమే ఆ ధరలు ఇచ్చిన వ్యాపారులు మళ్లీ తగ్గించి వేస్తున్నారు.

తగ్గుతున్న గరిష్ఠ ధరలు

గరిష్ఠ ధరలు పదిరోజులుగా తగ్గిపోతున్నాయి. గత నెల 24న కిలో రూ.346, 25న రూ.340, 30న రూ.331, ఈనెల 3న రూ.326, 4వ తేదీన రూ.315కు ధరలు దిగజారాయి. అలా పదిరోజుల వ్యవధిలో కిలోకు రూ.30 మేర పతనమైంది. ఇక కనిష్ఠ ధరలు కూడా పడిపోయాయి. కిలో రూ.70నుంచి 80కి కొనుగోలు చేస్తున్నారు. ఆ ప్రభావంతో సగటు ధరలు తగ్గిపోతున్నాయి. ఇప్పటి వరకు కిలో సగటు ధర రూ.230 వరకూ ఉంది. మార్కెట్ తగ్గుతూ పోతే వేలం పూర్తయ్యే నాటికి మరో రూ.20 వరకు పడిపోయే అవకాశం ఉంది. అంటే రెండేళ్ల నాటి సగటు ధర (కిలో.237) కన్నా దాదాపు కిలోకు రూ.25వరకు తగ్గి ఆమేర తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం

ఒంగోలు రిమ్స్ ఆడిటోరియంలో కార్యక్రమం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక స్వచ్ఛాంధ్ర అవార్డులు-25 జిల్లాస్థాయి పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రిమ్స్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అవార్డు గ్రహీతలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

నేడు ఒంగోలులోనే 'మీకోసం' నిర్వహణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి మీకోసంను ఈసారి ఒంగోలులోనే ఏర్పాటుచేసినట్లు డీఆర్వో ఓబులేశు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత మార్కాపురంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటికీ అనివార్యకారణాల కారణంగా మార్పు చేయాల్సి వచ్చిందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఒంగోలులోని కలెక్టరేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి వచ్చి తమ సమస్యలను నివేదించాలని కోరారు.



బొప్పాయి తోటలకు వైరస్

వాతావరణ మార్పులతో రైతుల బెంబేలు

5



వర్సిటీ వెలవెల

- ఆంధ్రకేసరి యూనివర్సిటీలో పలు కోర్సుల్లో భర్తీ కాని సీట్లు
- నామమాత్రపు ప్రవేశాలతోనే కొనసాగింపు
- కొన్ని విభాగాల్లో ఒక అంకె కూడా దాటని విద్యార్థుల సంఖ్య

ఒంగోలు విద్య, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జిల్లావాసి టంగుటూరి ప్రకాశం పంతులు పేరు మీద ఆవిర్భవించిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ విద్యార్థులు లేక వెలవెలబోతోంది. వర్సిటీ కళాశాలలోని మొత్తం సీట్లలో మూడో వంతు కూడా భర్తీ కావడం లేదు. ఒకప్పుడు ఒంగోలులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీజీ కేంద్రం విద్యార్థులతో కళకళలాడుతుండేది. అప్పట్లో ఆ కేంద్రంలో చేరేందుకు పోటీపడేవారు. అక్కడ సీట్లు రాకపోతేనే ప్రైవేటు పీజీ కళాశాలల వైపు చూసేవారు. ప్రస్తుతం సీన్ రివర్స్ అయింది. ముందుగా పేరున్న ప్రైవేటు కళాశాలలవైపు మొగ్గుచూపి అక్కడ సీట్లు రాకపోతేనే యూనివర్సిటీ వైపు చూస్తున్నారు. తరగతుల నిర్వహణ కూడా నామమాత్రంగానే ఉండటంతో వర్సిటీలో చేరేందుకు విద్యార్థులు ముందుకు రావడం లేదు.

మూడో వంతు సీట్లు భర్తీ కావట్లేదు

ఏకేయూ కళాశాలలోని మొత్తం సీట్లలో కనీసం మూడో వంతు సీట్లు భర్తీ కాని పరిస్థితి నెలకొంది. యూనివర్సిటీ కళాశాలలో మొత్తం 13 విభాగాల్లో 595 సీట్లు ఉండగా 2024-25 విద్యా సంవత్సరంలో కేవలం 191 సీట్లు (32)శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. ఈ 191లో పీజీ సెట్ కౌన్సెలింగ్ ద్వారా 118 మంది, స్పాట్ అడ్మిషన్ల ద్వారా 73 మంది విద్యార్థులు చేరారు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26)లో పీజీ సెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 129 సీట్లు అంటే కేవలం 22శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. ఎంబీఏ, బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లోనే రెండంకెల్లో విద్యార్థులు చేరారు. మిగిలిన 10 విభాగాల్లో ఒక అంకె దాటలేదు. కొన్ని విభాగాల్లో అధ్యాపకులు, సిబ్బంది సంఖ్య కంటే విద్యార్థులే తక్కువగా ఉన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో మూడు విభాగాల్లో గత సంవత్సరం ఒక విభాగంలో ఒక్కో విద్యార్థి ప్రవేశం పొందారు. ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఈడీ, స్టాటిస్టిక్స్‌లో ఒక్కొక్కరు, ఎకనామిక్స్, కామర్స్‌లో ఇద్దరేసి, మేథమేటిక్స్‌లో



ముగ్గురు విద్యార్థులు చేరారు.

అంతంతమాత్రంగానే ప్రభుత్వ ప్రోత్సాహం

పీజీ కోర్సులకు ప్రభుత్వ సహకారం అంతంతమాత్రంగానే ఉంది. యూనివర్సిటీలో కొత్తగా ప్రారంభించిన ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఆక్వాకల్చర్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయడం లేదు. ఒంగోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ యూనివర్సిటీలో చేరే వారికి మొండిచెయ్యి చూపుతోంది. ఈ మూడు కోర్సులకు ఏకేయూ స్వయంగా నిధులను సమకూర్చుకోవాలని చెప్పి ప్రభుత్వం చేతులు దులుపుకొంది.

మరింత మంది చేరతారు

యూనివర్సిటీలో అడ్మిషన్ల విషయమై డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సోమశేఖర్‌ను వివరణ కోరగా పీజీ సెట్ రెండో విడత కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లలో మరింత మంది విద్యార్థులు చేరుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ యూనివర్సిటీలో విద్యార్థులకు క్రమం తప్పకుండా తరగతులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.



- దసరా సెలవులు ముగియడంతో రవాణా వ్యవస్థకు డిమాండ్
- బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు రద్దీ
- దూర ప్రాంతాలకు వెళ్లే వారికి తప్పని ప్రయాణ కష్టాలు

ఒంగోలు డిపోలో కిక్కిరిసిన ప్రయాణికులు

కిటకిట...!

ఆర్టీసీ బస్సులు, రైళ్లల్లో రిజర్వేషన్‌లు ఫుల్



రైలులో ఎక్కేందుకు ఖాళీలేక అల్లాడుతున్న ప్రయాణికులు

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవులు ముగియడంతో రవాణా వ్యవస్థకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పండుగకు సొంతూర్లకు వచ్చి ఉద్యోగ, ఉపాధి, చదువుల నిమిత్తం తిరిగి వెళ్లే వారికి ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. ఈనెల 2వ తేదీతో సెలవులు ముగిశాయి. శుక్రవారం నుంచి ఆఫీసులు, స్కూళ్లు తెరుచుకున్నాయి. ఉద్యోగులకు ఆప్షనల్ హాలిడే అవకాశం ఉండటంతో మరో రెండు రోజులు స్వగ్రామాల్లోనే గడిపారు. ఆదివారం తిరుగు ప్రయాణం కావడంతో రైళ్లు, బస్టాండ్‌లు కిటకిటలాడాయి. అన్నిచోట్లా రిజర్వేషన్‌లు ఫుల్ అన్న బోర్డులు దర్శనమిచ్చాయి. ప్రధాన రహదారులన్నీ ట్రాఫిక్‌తో రద్దీగా మారాయి.

సాధారణ బస్సుల కోసం పడిగాపులు

పల్లెల నుంచి పట్టణాలకు చేరుకునేందుకు జిల్లాలో అధిక శాతం మందికి ఆర్టీసీనే ఆధారమైంది. పండుగ సందర్భంగా ఆర్టీసీ అధికారులు కొన్ని రూట్లలో తిరిగే బస్సులను రద్దు చేసి దూర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులుగా కేటాయించడంతో అప్పుడప్పుడూ వచ్చే పల్లె వెలుగు కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఒంగోలుకు ఎలాగోలా చేరుకుంటున్న అధిక శాతం మందికి ప్రైవేటు ట్రావెల్స్ ఆధారమయ్యాయి. ఆర్టీసీలో ఓల్వా, ఇంద్ర, సూపర్ లగ్జరీ, స్లీపర్, గరుడ వంటి బస్సుల్లో ఇప్పటికే రిజర్వేషన్ ఫుల్ అయ్యింది. రైళ్ల లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఎక్కువ మంది సాధారణ బస్సుల్లోనే ప్రయాణించాల్సి వస్తోంది.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

దూరప్రాంతాలకు వెళ్లే వారి కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ప్రకాశం రీజియన్ నుంచి సుమారు 10 బస్సులను అదనంగా కేటాయించారు. హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, విజయవాడ వంటి ప్రాంతాలకు వీటిని కేటాయించారు. ఆ బస్సుల్లోనూ సీటు దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో గమ్యస్థానం చేరుకునేందుకు ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఇక స్పీడ్ పోస్ట్

అమలులోకి వచ్చిన నూతన పోస్టల్ సేవలు

ఆదాయ వనరుల పెంపుతోపాటు పనుల్లో వేగం

వివిధ సర్వీసులపై పెరిగిన చార్జీలు

5

5

వామ్మో.. పెద్దపులి..!

పెద్దదోర్నాలలో సంచారం, వెలిగండ్ల మండలంలో చిరుత

భయాందోళనలో గ్రామస్థులు..

అప్రమత్తంగా ఉండాలన్న అధికారులు

వలస కార్మికులు విలవిల

- గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల నిరవధిక సమ్మెతో ఉపాధి కరువు
- పూట గడవక ఇబ్బందులు
- కొందరు సొంత రాష్ట్రాలకు పయనం

చీమకుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గనుల సీనరేజీ వసూలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు చేపట్టిన నిరవధిక సమ్మె వలస కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఐదురోజుల నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పొట్ట చేతపట్టుకొని ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చిన వారికి పూట గడవని దుస్థితి నెలకొంది. చీమకుర్తి, రామతీర్థం, మర్రిచెట్లపాలెం, బూదవాడ పరిసర ప్రాంతాల్లో దాదాపు 800 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు పది వేల మందికిపైగా వలస కార్మికులు, మరో పది వేల మంది ఇతర కార్మికులు పనిచేస్తున్నారు. వలస కార్మికులంతా కాంట్రాక్ట్ పద్ధతిపై వచ్చిన వారు కావడంతో రాయి కటింగ్ చేసిన మేరకు మాత్రమే వారికి వేతనం అందుతుంది. ఈ పరిస్థితుల్లో ఈనెల ఒకటో తేదీ నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్లు తమ ఫ్యాక్టరీలను షట్‌డౌన్ చేశారు. దీంతో వలస కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వీరిలో రాజస్థాన్, ఒడిసా, జార్ఖండ్, బిహార్ తదితర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఎక్కువగా ఉన్నారు. రాజస్థాన్‌కు చెందిన కార్మికుల్లో చాలా మంది ఇక్కడ నెలకొన్న క్లిష్ట పరిస్థితులను గమనించి తిరుగుముఖం పట్టారు. మిగతా వారు తమ పరిస్థితి ఏమిటని బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. గత కరోనా కాలంలో ఫ్యాక్టరీలు మూతపడిన సమయంలో భారీ స్థాయిలో వలస కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఫ్యాక్టరీ ఓనర్లు సైతం ఆందోళన చెందుతున్నారు.

సీఐటీయూ నాయకుల పరామర్శ

గ్రానైట్ ఫ్యాక్టరీలు మూతపడటంతో అప్పటివరకు వాటిలో ఉండిన కాంట్రాక్ట్ కార్మికులు ఇప్పుడు అద్దె గదుల్లో ఉండాల్సి వస్తోంది. పూటగడవడం కష్టంగా మారింది. తమ పరిస్థితి ఏమిటా అని దిగాలుగా ఉన్న కార్మికులను ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని గ్రానైట్ పరిశ్రమలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను పరిష్కరించాలని కోరారు. వలస కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సమ్మెకు ఎడ్జ్ కటింగ్ ఫ్యాక్టరీ ఓనర్ల మద్దతు

గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సమ్మెకు ఎడ్జ్ కటింగ్ ఫ్యాక్టరీ (టూ బై ఓన్ కటింగ్ ఫ్యాక్టరీల) ఓనర్ల అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. ఆదివారం రామతీర్థం వద్ద ఉన్న వీటీసీలో నిర్వహించిన సంఘ సమావేశానికి దాదాపు 200 మంది హాజరై తమ సంఘీభావాన్ని తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. తాము కూడా సమ్మెలో పాల్గొంటామని స్పష్టం చేశారు.



వలస కార్మికులు దుస్థితిని పరిశీలిస్తున్న కాలం సుబ్బారావు

శనగ రైతులకు క్వింటాకు రూ.3వేల బోనస్ ఇవ్వాలి

● ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమారెడ్డి
● నేడు ప్రకాశంభవనం ఎదుట ధర్నా

ఒంగోలు(రూరల్), అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): శనగ పంట రైతులకు ప్రభుత్వం క్వింటాకు రూ.3వేల బోనస్ ఇవ్వాలని, లేకుంటే క్వింటా శనగలు (జేజేలు) రూ.10వేలకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.హనుమారెడ్డి డిమాండ్ చేశారు. ఒంగోలు మండలం కరవదిలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం శనగ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమారెడ్డి మాట్లాడుతూ శనగలను వ్యాపారులు కొనుగోలు చేయకపోవటంతో రైతులు తీవ్రనష్టాల పాలవుతున్నారని చెప్పారు. శనగ సాగుకు ఎకరాకు రూ.30వేలకు పైగా ఖర్చు చేశారని, కౌలురైతులు తీవ్రంగా నష్ట పోయే పరిస్థితులు వచ్చాయన్నారు. శనగల నిల్వలు శీతల గిడ్డంగుల్లో మూలుగుతున్నాయని, వాటిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదన్నారు. ఇప్పుడు తిరిగి శనగపంట సాగు చేసే రోజులు కూడా వచ్చాయని, ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. మరోపక్క పొగాకు పంటను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయకపోవటంతో ఆ రైతులు కూడా నష్టాలు చవిచూసే పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. బోర్డు అధికారులు పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చెబుతున్నారని, అయితే రైతులు పొగాకు లేదా శనగపంటను ఎక్కువగా సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. అందువల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ఈక్రమంలో శీతల గిడ్డంగుల్లో ఉన్న గల శనగలకు ప్రతి క్వింటాకు రూ.3వేలను బోనస్ కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. శనగ రైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 6వ తేదీన స్థానిక ప్రకాశంభవనం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, రైతు సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు

జిల్లాస్థాయి హాకీ జట్ల ఎంపిక రేపు

సంతనూతలపాడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మైనంపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఈనెల 7న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 ఉమ్మడి జిల్లా స్థాయి బాల, బాలికల హాకీ జట్ల ఎంపికలు జరగనున్నట్లు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి చింపారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 1-1-2007 తర్వాత జన్మించిన వారై ఇంటర్ సెకండియర్ చదువుతూ ఉండాలని తెలిపారు. ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకుని ఈనెల7న ఉదయం 9 గంటలకు మైనంపాడు ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. వివరాలకు పీఈటీ రవికుమార్ సెల్: 9951578357ను సంప్రదించాలని కోరారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



ఎండ్లూరులో నిరసన తెలుపుతున్న మాదిగ మహాసేన నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా దైవలంపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని గాంధీనగర్‌లోని మూడు బొమ్మల సెంటర్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నిందితులను అరెస్టు చేయని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.బలరామయ్య, దాసరి సంగీతరావు, వెంకటేష్‌నాయక్, డోలా రాధ, ఎ.సునీల్, జాలరామయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అట్లూరి రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఎండ్లూరు గ్రామంలోని అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద పలువురు నాయకులతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాదిగ మహాసేన నాయకులు పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్టు

●రూ.1,31,250 నగదు స్వాధీనం

సింగరాయకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని పోతయ్యగారి పట్టపుపాలెం పరిసర ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందెం శిబిరంపై ఆదివారం ఎస్సై బీ మహేంద్ర తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో రూ.127,800 నగదును, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. కాగా పాకల ఎస్సీ కాలనీలో పేకాడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసి రూ.3450 నగదును, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఎస్సై బేగ్, రైటర్ భాస్కర్ లింగం పాల్గొన్నారు.

మైనంపాడులో ఏడుగురు..

సంతనూతలపాడు: మైనంపాడు పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆదివారం ఎస్ఐ వి.అజయ్‌బాబు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.14,250 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు పవన్‌కుమార్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ

సింగరాయకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని సింగరాయకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చావా హజరత్తయ్య హెచ్చరించారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో డాగ్‌స్క్వాడ్‌తో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు అధికంగా సంచరించే ప్రదేశాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పబ్లిక్ ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి.మహేంద్ర, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ నగరోత్సవం



అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం మర్రిచెట్ల కాలనీలో ఆదివారం దుర్గమ్మ నగరోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. గత నెల 22వ తేదీ నుంచి ఇక్కడ దసరా శరన్నవరాత్రులు నిర్వహించారు. అర్చకులు రాము శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. అదేవిధంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా ఆదివారం మేళతాళాలు, డీజే పాటలు, అమ్మవారి వేషధారణలతో దుర్గమ్మ నగరోత్సవాన్ని మర్రిచెట్ల కాలనీ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఎర్రగుడిపాడులో పిడుగుపాటు



కొబ్బరిచెట్టుపై పడిన పిడుగుతో రేగిన మంటలు

చీమకుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండల పరిధిలో ఆదివారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురిసింది. ఎర్రగుడిపాడు గ్రామంలోని ఎస్సీకాలనీలో తాటిగిరి రమణయ్య ఇంటి ప్రాంగణంలో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణప్రమాదం చోటుచేసుకోకపోవటంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

వైద్య విద్య ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 17 మెడికల్‌కాలేజీలను ప్రభుత్వ ఆధీనంలో కొనసాగించాలని కోరారు. స్థానిక ఎంసీఏభవన్‌లో ఆదివారం 107, 108 జీవోలను రద్దు చేయాలని కోరుతూ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని చెప్పారు. రాష్ట్రానికి కేంద్రం ప్రకటించిన మెడికల్ కళాశాలలు సుమారు 80శాతం మేర పూర్తయ్యాయని, కేవలం 20శాతానికి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం బాధాకరమన్నారు. 107, 108 జీవోల ద్వారా సెల్ఫ్ ఫైనాన్స్‌సిస్టం పెట్టి విద్యార్థుల వద్ద నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తారని ఆరోపించారు. ఈ విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బి.సుబ్బారావు, పీవీ.సుబ్బారావు, రాయపాటి జగదీష్, బేగ్, జార్జి, పేరయ్య, లక్ష్మీనారాయణ, కార్తీక్, సుధాకర్, సచిన్, ప్రేమ్ కుమార్, సలార్ తదితరులు పాల్గొన్నారు.

11న మార్కాపురంలో
రౌండ్ టేబుల్ సమావేశం : జేవీవీ

ఒంగోలు కలెక్టరేట్: ప్రభుత్వ ఆధీనంలోనే విద్య, వైద్య, ప్రజారోగ్య వ్యవస్థ కొనసాగాలని జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య హక్కులకు, పేద ప్రజల వైద్యానికి హామీ ప్రభుత్వ మెడికల్‌కాలేజీతోనే సాధ్యమన్నారు. గతంలో మంజూరైన 17 మెడికల్ కాలేజీలలో జిల్లాలోని మార్కాపురం మెడికల్‌కాలేజీతో సహా రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరించే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.వెంకట్రావు, జి.శ్రీనివాసరెడ్డిలు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈనెల 11న మార్కాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావుతో పాటు ప్రముఖ వైద్యులు, వైద్య రంగ నిపుణులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా రౌండ్‌టేబుల్ సమావేశం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవీ.పుల్లారావు, కుర్రా రామారావు, సీహెచ్.జయప్రకాష్, డాక్టర్ బుజ్జిబాబు, యు.భాస్కర్, తిరుపతయ్య, వెంకటేష్, డీఎల్‌ప్రసాద్, మాల్యాద్రి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. మద్దిపాడు మండలంలో ఇరువురు, ఒంగోలు నగర పరిధిలో ఒకరు చనిపోయారు.

మద్దిపాడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లంపల్లి బ్రిడ్జి సమీపంలో ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందారు. శనివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కందుకూరు నుంచి పొగాకు లోడుతో వెళ్తున్న లారీ రిపేరు వచ్చి హైవే బ్రిడ్జి సమీపంలో ఆగి ఉంది. అదే క్రమంలో గుంటూరు వైపు నుంచి వస్తున్న బాక్స్ కంటైనర్ అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ అనూష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మద్దిపాడు ఎస్ఐ వెంకటసైదులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

● బూరేపల్లి కాలనీ పోలేరమ్మ గుడి సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందాడు. నాగులుప్పలపాడు నుంచి రామాంజనేయులు మోటార్‌సైకిల్ వస్తుండగా మరో మోటార్‌సైకిల్ ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి గాయపడగా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ వెంకటసైదులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

కారు ఢీకొని యువకుడి మృతి

ఒంగోలు క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన త్రోవగుంట ఫ్లైఓవర్ పక్కన ఉన్న చీరాల వెళ్లే సర్వీస్‌రోడ్డులో ఆదివారం జరిగింది. నాగులుప్పలపాడు మండలం టి.అగ్రహారంనకు చెందిన గోపతోటి ఆశోక్ (25) మోటార్ సైకిల్‌పై ఒంగోలు నుంచి స్వగ్రామం వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో అశోక్ రోడ్డు మీద పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయమై రక్తస్రావం జరిగి అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

శివరాయునిపేటను ప్రత్యేక పంచాయతీగా మార్చాలి

● మంత్రిని వేడుకున్న గ్రామస్థులు



మంత్రి స్వామికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కాకర్ల సర్పంచ్, నాయకులు

మర్రిపూడి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కాకర్ల పంచాయతీలో ఉన్న శివరాయునిపేటను విభజించి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని సర్పంచ్ మేళం శివనారాయణ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు కోరారు. ఆదివారం తూర్పునాయుడుపాలెంలో రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాకర్ల పంచాయతీలో 12వార్డులు ఉండగా 9వార్డులు శివరాయునిపేట గ్రామంలో ఉన్నాయని కేవలం మూడు మాత్రమే కాకర్లలో ఉన్నాయని పేర్కొన్నారు. 2,250 మంది ఓటర్లు శివరాయునిపేటలో ఉండగా కాకర్లలో 750 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. అతిచిన్న గ్రామాన్ని పంచాయతీ కేంద్రంగా ఏర్పాటు చేయడం వలన వేలాది మంది జనాభా కలిగిన శివరాయునిపేట గ్రామస్థులు ప్రతి చిన్నపనికి రెండు కిలోమీటర్లకుపైగా కాకర్లకు నడిచివెళ్లి పనులు చక్కబెట్టుకోవాల్సి వస్తుందని వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల పునర్విభజనకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా విభజించాలని వారు కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని సర్పంచ్ శివనారాయణ తెలిపారు. పంచాయతీ తీర్మానాన్ని జత చేసి ఎంపీడీవోకు, జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేస్తామని ఆయన చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో ఉపసర్పంచ్ ముకుంద రమణయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు చిరుకూరి బ్రహ్మయ్య, నీటి సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి రామిరెడ్డి, నాయకులు రమణారెడ్డి, గురజాల నాగయ్య, జి. శ్రీనివాసులు, ఎం. కాశయ్య, బంగారయ్య, గోవిందు, రమేష్, ప్రేమానందం, ప్రభాకర్, శ్రీనివాసులు ఉన్నారు.

వీరయ్యచౌదరి హత్య కేసులో నిందితులపై రౌడీషీట్లు

● ఎస్పీ ఆదేశాల మేరకు 10 మందిపై ఓపెన్

ఒంగోలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య కేసులో నిందితులుగా ఉన్న 10 మందిపై ఎస్పీ ఆదేశాల మేరకు తాలూకా పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్లు తెరిచారు. వీరిలో ప్రధాన సూత్రధారి అయిన ముప్పా సురేష్‌తో పాటు, ప్రధాన పాత్రధారి బి.వినోద్‌కుమార్, ఒంగోలు బాలాజీనగర్‌కు చెందిన మార్టూరి కిరణ్‌కుమార్, బలరాంకాలనీకి చెందిన సమీర్, నాగులుప్పలపాడు మండలం దాసరివారిపాలెంకు చెందిన తోటా శ్రీనివాసరావు, అమ్మనబ్రోలుకు చెందిన వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరి, ఆళ్ల సాంబశివరావు (సిద్ధాంతి), నెల్లూరుకు చెందిన బెల్లంకొండ వెంకట్ గౌతమ్, ఓబిలి నాగరాజు, తువ్వ వంశీకృష్ణ ఉన్నారు. వీరిపై నిరంతర నిఘా ఉంచుతున్నామని తాలూకా సీఐ విజయకృష్ణ తెలిపారు.

ఆధ్యాత్మికవేత్తకు సన్మానం



రమేష్‌కృష్ణను సన్మానిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక ప్రవచకులు రామచంద్రుని రమేష్‌కృష్ణను ఆదివారం ఘనంగా సన్మానించారు. పద్య సారస్వత పరిషత్ జిల్లా అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి దంపతుల ఆధ్వర్యంలో ఒంగోలులోని రమేష్‌కృష్ణ స్వగృహంలో ఆయనను పద్యనీరాజన సన్మానపత్రంతో పాటు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఇటీవల పూరిక్షేత్రంలో ఏర్పాటు చేసిన భాగవత సప్తాహం కార్యక్రమంలో రమేష్‌కృష్ణ అద్భుతంగా భాగవత ప్రవచనం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రాంప్రసాద్, కంభంపాటి లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు సీఐ కౌన్సెలింగ్

ఒంగోలు క్రైం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లు రోడ్లపైకి వచ్చి ప్రజలను వేధించడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ యు.సుధాకర్ హెచ్చరించారు. ట్రాన్స్‌జండర్లు నివాసం ఉండే ఒంగోలు నగరంలోని ఇందిరమ్మకాలనీ, ఇస్లామ్‌పేటలో ఆదివారం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. రహదారులపై వాహనదారులను ఆపి డబ్బులు వసూలు చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. సమాజంలో గౌరంగా బతకాలని హితవు పలికారు. పోలీసుశాఖ పూర్తిగా సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం

మర్రిపూడి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ మండల యూనిట్ సర్వసభ్య సమావేశం ఆదివారం మర్రిపూడి బాడి కిషోర్ అధ్యక్షతన స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షునిగా ఆర్.రమేష్, ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులుగా టీవీ.సుబ్రమణ్యం, కె.సునీత, బి.సుబ్బారావు, కార్యదర్శులుగా కె.సాంబశివరావు, ఈవీ.సుజాత, షేక్ ఖాజావలి, కే రమేష్, ఎం.అశోక్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా బీడీ.కిషోర్‌కుమార్, కె.సుబ్బారావు, ఎం.వెంకటరెడ్డి, కల్పన, ఎ.సుబ్రమణ్యం, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.బాలచందర్‌లు ఎన్నికైనట్లు శేషారావు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షకులుగా జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ కార్యదర్శి రఘుబాబు, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసులు హాజరయ్యారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

నాగులుప్పలపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడులోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం వద్ద జరిగిన దేవీనవరాత్రులు అనంతరం గోవిందమాంబ అమ్మవారి నగరోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్దివేడుకలు



మాట్లాడుతున్న డాక్టర్ జవహర్

చీమకుర్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : ఆర్ఎస్ఎస్ సంస్థ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శతాబ్ది వేడుకలను చీమకుర్తి పట్టణంలో ఆదివారం పద్మశాలీయ కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యుడు బి.జవహర్ మాట్లాడుతూ భారతదేశం విశ్వగురుగా విరాజిల్లాలని ఆకాంక్షించారు. వందేళ్లగా దేశ ఔన్నత్యాన్ని కాపాడటానికి ఆర్ఎస్ఎస్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ ప్రముఖ్ వి.మార్కండేయులు, ఖండ కార్యవాహ వేలూరు వెంకట మధుప్రసాద్, వీవీ.శివారెడ్డి, ఉపాసకులు కృష్ణస్వామి, గుండా శ్రీనివాసరావు, మాజేటి హనుమాన్, చలువాది పార్థసారథి, వెల్లంపల్లి రంగారావు, సుబ్బయ్య, గుణప్రసాద్, పుత్తూరి శ్రీనివాసరావు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో విజయవాడ : ఫ్యాప్టో



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు విద్య, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు పిలుపునిచ్చారు. ఒంగోలులో ఆదివారం ఫ్యాప్టో నాయకులు చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి బోధనేతర, ఆర్థిక విషయాలపై ఒక స్పష్టమైన రూట్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీస్‌రూల్స్ సమస్యలను పరిష్కరించాలని, విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో విజయవాడకు ఉపాధ్యాయులందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.శ్రీనివాసులు, వై.వెంకట్రావు, చిన్నస్వామి, ఎస్.రవి, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి, పీబీ.సుబ్బారావు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు యు.వెంకట్రావు, భాస్కర్ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విభావరిలో పాల్గొన్న కళాకారులు, గాయకులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. సంస్థ అధినేత గుమ్మడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా కళాకారులు ఘంటసాల వెంకటేశ్వరరావు, రామకృష్ణ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొనసాగిన సంగీత విభావరిలో గుమ్మడి శ్రీనివాసరావు, మొవ్వా నాగేశ్వరరావు, వై.గోపాలరావు, ఆర్.ఏడుకొండలు, తన్నీరు బాలాజీ, డాక్టర్ మల్లిఖార్జునరావు, పాలేటి చంద్రశేఖర్, బి.వెంకట్ మాస్టర్, కె.పూర్ణిమ విజయ్, డి.శైలజారాజేష్, సుహాసిని తదితర గాయకులు ఆలపించిన పలు చిత్రాలలోని పాటలు ప్రేక్షకులను అలరించాయి. జెర్మియా బృందం వాద్య సహకారాన్ని అందజేయగా గుర్రం కృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో రైల్వే నాగేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరావు, ఏల్చూరి అనంతలక్ష్మి, ఐ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంస్కృతిక రాయబారులు



ప్రసంగిస్తున్న చిన్మయ మిషన్ ప్రబోధకులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులు సాంస్కృతిక రాయబారులని చిన్మయ మిషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఒంగోలు నగరం శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్తంగా శ్రీగిరి గోక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన బాలవిహార్ శిక్షణ తరగతులలో వారు ప్రసంగించారు. మాతృభాషలో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ వారిలో నిబిడీకృతమైన శక్తి సామర్థ్యాలను వెలికి తీసేందుకు ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఈ సందర్భంగా కథలు చెప్పటం, అంత్యాక్షరి, భగవద్గీత శ్లోకాలు పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరి ఝాన్సీ రాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులు ఇష్టంగా చదవాలి



అవగాహన కల్పిస్తున్న సంపూర్ణ

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మనసుపెట్టి ఇష్టంగా చదివితే ఏదైనా సులభంగా నేర్చుకోవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథపాలకురాలు కాళహస్తి సంపూర్ణ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పలు పుస్తకాలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం అధ్యాపకులు సీహెచ్.కోటేశ్వరరావు విద్యార్థులకు కథలు చెప్పటం నేర్పించగా, ఆర్ట్, క్రాఫ్ట్ తరగతులను బిందు నిర్వహించారు. కార్యక్రమంలో మంచికంటి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ మధురశ్రీ విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిల్‌స్టాండ్ ఏర్పాటు



సైకిల్ స్టాండును ప్రారంభిస్తున్న అధ్యక్షుడు రాఘవరావు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీనగర్‌లోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నిర్మాణం చేసిన విద్యార్థుల సైకిల్ స్టాండ్‌ను క్లబ్ అధ్యక్షులు పీవీ.రాఘవరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ శాశ్వత పథకం కింద గోపిరెడ్డి వెంకటరెడ్డి, సునీత దంపతుల సహకారంతో సైకిల్ స్టాండ్‌ను నిర్మించినట్లు చెప్పారు. తమ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా సుమారు 70 మంది మహిళలకు చీరలు, విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఇక మడనూరులోని గోసంఘానికి పశువుల దాణా అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

దీపావళి టపాసులు పట్టివేత

మద్దిపాడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు గ్రామానికి చెందిన పొదిలి శ్రీనివాసరావు ఇంటిలో ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన సుమారు రూ.60వేల విలువ చేసే దీపావళి టపాసులు శనివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాసరావుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

నూతన పద్ధతుల్లో విద్యా బోధన

● డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నూతన పద్ధతుల్లో విద్యాబోధన, విజ్ఞానాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) కిరణ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రైవేటు టీచర్లకు స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవసభ జరిగింది. ఈ జిల్లా అధ్యక్షుడు వై. సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డీఈవో మాట్లాడుతూ తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్ తీర్చిదిద్దబడుతుందనే నానుడిని నిజం చేసి ఆ కృషిలో నిమగ్నమైనందుకు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ టీ.గోపిమూర్తి మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రైవేటు టీచర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం ప్రభుత్వాన్ని నిలదీసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రైవేటు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎం. సూర్యారావు, మాంటిస్సోరి హైస్కూలు కరస్పాండెంట్ పి.శబరీనాథ్, నాయకులు టి. రమణ, యు. కిరణ్, ఎస్కే నూరుద్దీన్, ఉప్పుగుండూరి మారుతి, జె రోహిత్ కల్యాణ్ తదితరులు ఉన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

● ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు పట్టణానికి మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం రూ.51 లక్షలతో సిమెంటు రోడ్లు, డ్రైయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైయినేజీ లాంటి వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. పట్టణంలోని ఎస్టీ కాలనీలో రూ.10.56 లక్షలతో నిర్మాణం చేపడుతున్న డ్రైయినేజీలకు భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 14వ వార్డు అర్బన్‌కాలనీలో రూ.13లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు, 3వ వార్డు శ్రీరామ్ నగర్‌లో రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, కొంగళవీడు రోడ్డులో రూ.18లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి ఆయా ప్రాంతాలలో శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, టీడీపీ నాయకులు కుప్పా రంగసాయి, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, కౌన్సిలర్లు బి.చంద్రశేఖర్‌యాదవ్, టీడీపీ నాయకులు పాలుగుళ్ళ చిన్నశ్రీనివాసరెడ్డి, బిల్లా రమేష్, బోయిళ్లపల్లి కిశోర్, వేములపాటి చంటి, కావడి గురువయ్య, ఉలాపు బాలచెన్నయ్య, అబ్బు ఓబయ్య పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

● కొండపి మండలం శివారు గ్రామానివని అనుమానం
● 40 క్వింటాళ్ల స్వాధీనం ● దర్యాప్తు చేస్తున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వాహనం

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలం సరిహద్దున ఉన్న కొండపి మండలంలోని శివారు గ్రామం నుంచి కావలికి తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం వాహనాన్ని పోలీసులు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. నియోజకవర్గంలో రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్న వారిని కాదని ఆ డీలర్ కావలి వ్యాపారికి విక్రయించినట్లు తెలిసింది. దీంతో ఆ వాహనాన్ని పట్టించడం వెనుక నియోజకవర్గంలో బియ్యం వ్యాపారం చేస్తున్న వ్యాపారుల హస్తం ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గంలో బియ్యం వ్యాపారం చేస్తున్న వ్యక్తి ఆయా శాఖల అధికారులకు నెలవారీగా మామూళ్లు ఇస్తూ కేజీకి 16 రూపాయల చొప్పున డీలర్లకు ఇస్తున్నట్లు తెలిసింది. కావలికి చెందిన రైస్ మిల్లు ఓనర్ అయిన బియ్యం వ్యాపారి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గడిచిన ఐదారు నెలలుగా కేజీకి 20 రూపాయలకు పైగా ఇచ్చి కొందరు డీలర్లు నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలో కొండపి మండలంలోని శివారు గ్రామానికి చెందిన ఓ డీలర్‌కు వచ్చిన సరుకును వచ్చినట్లు నేరుగా కావలి వ్యాపారికి విక్రయించారు. పక్కా సమాచారంతో జరుగుమల్లి పోలీసులు బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈవిషయమై జరుగుమల్లి ఎస్సైను ఆంధ్రజ్యోతి వివరణ అడగ్గా 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. కావలికి చెందిన వ్యక్తులు కొనుగోలు చేశారని ప్రాథమిక సమాచారం ఉందని, విచారిస్తున్నామని చెప్పారు. కావలికి చెందిన రైస్‌మిల్లు ఓనర్, బియ్యం వ్యాపారి అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో కేసులు లేకుండా పోలీసులపై ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలిసింది.

రేపటి నుంచి అంతరిక్ష వారోత్సవాలు

ఒంగోలు విద్య, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : సతీష్ థావన్‌స్పేస్ సెంటర్, శ్రీహరికోట, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 7వతేదీ నుంచిమూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ వారోత్సవాల్లో జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లాసైన్స్ అధికారి టి. రమేష్ ఒక ప్రకటనలో కోరారు. 7వతేదీ సాయంత్రం ఐదు గంటలకు స్పేస్‌వాక్ జరుగుతుందన్నారు. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, పోస్టల్ కాంపిటేషన్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈపోటీల్లో విజేతలకు ఈనెల 9న క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని ఆయన తెలిపారు.

ఇక ‘స్పీడ్’ పోస్ట్

అమలులోకి వచ్చిన నూతన పోస్టల్ సేవలు
ఆదాయ వనరుల పెంపు తోపాటు పనిలో వేగం
వివిధ సర్వీసులపై పెరిగిన చార్జీలు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పోస్టల్ సేవలు స్పీడ్ అందుకున్నాయి. అందుబాటులోకి వచ్చిన ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని ఆ శాఖ ఆదాయ వనరులపై దృష్టి సారించింది. పోస్టల్ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు, గతంలో ఉన్న పాత విధానానికి స్వస్తి పలికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ 2.0తో రిజిస్టర్, స్పీడ్ పోస్ట్, అకౌంట్, ఇన్సూరెన్స్ సేవలు సులభతరం చేస్తోంది. అందులో భాగంగా ఆగస్టు 22వ తేదీ నుంచి అన్నీ సేవలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందిస్తుండగా, ఈనెల 1 నుంచి రిజిస్టర్ పోస్ట్ స్థానంలో స్పీడ్ పోస్ట్ విధానం అమలులోకి తీసుకొచ్చింది. ఇకపై అన్నీ పోస్టాఫీస్‌లలో రిజిస్టర్ పోస్ట్ పూర్తిగా తొలగించి, స్పీడ్ పోస్టు సేవలను ప్రజలకు అందిస్తోంది.



ఒంగోలులోని ప్రధాన తపాలా కార్యాలయం (ఫైల్)

డిజిటల్ డెలివరీ విధానంలో స్పీడ్ పోస్ట్

దశాబ్దాల తరబడి సంప్రదాయ విధానాలతో వెనుకబడి ఉన్న పోస్టల్ శాఖ ఆధునిక సాంకేతిక వైపు అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో రిజిస్టర్ పోస్టును కాస్త స్పీడ్ పోస్టుగా మార్చింది. అది కూడా డిజిటల్ డెలివరీ విధానం అమలు చేస్తోంది. ఈ విధానం ద్వారా ప్రస్తుతమున్న సేవలను మొక్కుబడిగా అమలు అవుతుండగా, న్యాయపరమైన, చట్టపరమైన నోటీసుల డెలివరీ విధానంలో సమయపాలన లేకపోవడంతో రిజిస్టర్ పోస్టుకు ప్రాముఖ్యత ఉంది. అయితే డెలివరీ సమయంలో ఓటీపీ విధానం అమలులోకి తీసుకొచ్చారు. ఎవరికైతే పోస్టు చేరాల్సి ఉందో వారి ఫోన్‌కు వచ్చే ఓటీపీని చెబితేనే డెలివరీ ఇస్తారు. దీంతో చేరాల్సిన వ్యక్తికే చేరిందనే విషయం నిర్ధారణ అవుతుంది. దాంతోపాటుగా స్పీడ్ పోస్టుకు కూడా అక్నాలడ్జిమెంట్ ద్వారా విధానం అమలు చేస్తున్నారు. స్పీడ్ పోస్టు చార్జీపై అదనంగా రూ. 5 చెల్లిస్తే అక్నాలెడ్జ్‌మెంట్ కూడా జత చేసి దానిని చేరినట్లు తిరుగు టపాలో తెలియజేస్తారు.

స్పీడ్ పోస్ట్ కొత్త ధరలు ఇవీ

స్పీడ్ పోస్ట్ కవరు బరువు, చేరాల్సిన దూరాన్ని బట్టి ధరలను నిర్ణయిస్తారు. 50 గ్రాముల నుంచి 500 గ్రాముల వరకు స్థానికంగా లేదా, 2వేల కిలోమీటర్లు దూరం పైబడి కూడా వసూలు చేస్తారు. అందుకోసం రూ. 19 నుంచి రూ.93 వరకు చెల్లించాల్సి ఉంది. దీనికి అదనంగా జీఎస్టీ కూడా వసూలు చేస్తారు. 50 గ్రాముల వరకు అయితే లోకల్ చార్జీలు రూ.15 నుంచి రూ. 19 పెరిగింది. అయితే 200 కి.మీ. లోపు అయితే గతంలో రూ. 35 వసూలు చేయగా, ఇప్పుడు రూ. 47కు పెరిగింది. ఆపైన ఎన్ని కి.మీ అయినా చార్జి రూ. 47గా నిర్ణయించారు. అలాగే 51 గ్రాముల నుంచి 250 గ్రాముల వరకు గతంలో రూ. 25 కాగా అంతకుముందు రూ. 25 ఉండగా, ప్రస్తుతం రూ. 34 కాగా అదే 200 కి.మీ. అయితే రూ. 35 ఉన్న ధర కొత్త ధర ప్రకారం రూ. 59 వసూలు చేస్తారు. 2001 కి.మీ. వెయ్యి కి.మీ.లకు అంతకుముందు రూ. 40, ప్రస్తుతం రూ. 63, వెయ్యి కి.మీ నుంచి రెండువేల కి.మీ వరకు గతంలో రూ. 60 ఉండగా, ప్రస్తుతం 72కు పెరిగింది 2వేల కి.మీపైన అంతకుముందు రూ. 70 ఉండగా, ప్రస్తుతం రూ. 77కు పెరిగింది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాపు జేఏసీ నేత జనార్దన్

గిరి బలిజ జీవోపై స్టేటస్‌కోను స్వాగతిస్తున్నాం

● కాపు జేఏసీ నేత జనార్దన్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : దొమ్మరులను గిరి బలిజ గా మారుస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోపై స్టేటస్‌కో ఇవ్వడాన్ని కాపు జేఏసీ స్వాగతిస్తుందని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్దన్ అన్నారు. స్థానిక కాపు సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవోనెంబర్ 5కు స్టేటస్‌కో ఇస్తూ 7ను తీసుకురావడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాల కాలం నుంచి కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు బీసీ రిజర్వేషన్ అంశం పెండింగ్‌లో ఉందన్నారు. ఐదుశాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోర్టు పరిధిలో ఉన్నందున ప్రభుత్వం రిజర్వేషన్ అంశంపై ప్రకటన చేసి పరిష్కారం చూపాలన్నారు. జనాభాదామాషా ప్రకారం ఈ వర్గాలకు రాజకీయ, నామిటేటెడ్ పదువుల్లో అవకాశం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే జిల్లాల పర్యటన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి అవసరమైతే నిరహారదీక్షలు చేసేందుకైనా వెనుకాడేది లేదని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు దివంగత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కాపుసంఘంజిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్, శ్రీ కృష్ణదేవరాయ ఉద్యోగ జేఏసీ కన్వీనర్ ఎస్. రామకృష్ణ, ఎన్.రామ్మోహన్, పి. రాజసులోచన, హనుమంతరావు, సూరినేని పోలేరయ్య, తోట నారాయణ, తోట రామారావు, నారాయణ, వాసన అంకబాబు, కే శ్రీనివాసరావు, ఆర్. రాఘవ, రేకపల్లి శ్రీనివాసరావు, తెలప్రోలు శ్రీకాంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బొప్పాయి తోటలకు వైరస్

వాతావరణ మార్పులతో రైతుల బెంబేలు
ఈ ఏడాది పెరిగిన సాగు విస్తీర్ణం
జాగ్రత్తలతోనే పంటకు రక్ష

త్రిపురాంతకం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనుకూలంగా ఉంటే లాభాలు తెచ్చిపెట్టే బొప్పాయికి ప్రతి ఏటా ఎదురయ్యే ఒకే ఒక్క భయం వైరస్. పలు రకాలుగా పీడించే ఈ వైరస్ సోకిందంటే బొప్పాయి రైతులకు కష్టాలతో పాటు నష్టాలు చవిచూడాల్సిందే. అందుకే బొప్పాయికి చీడ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో సాధారణంగా ఏటా దాదాపు 6వేల ఎకరాల్లో బొప్పాయి సాగవుతున్నట్లు అధికారులు చెప్తుండగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో సాధారణ విస్తీర్ణం 1,450 ఎకరాలుగా ఉండేది. కానీ గత ఏడాది కాస్త ఆశాజనకంగా బొప్పాయి దిగుబడులు, ధరలు ఉండడంతోపాటు ఈ ఏడాది మిర్చి పంటను తగ్గించుకున్న కొందరు రైతులు బొప్పాయి వైపు మొగ్గుచూపారు. ఈ కారణంగా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం రెట్టింపైంది. ఈ ఏడాది 2,800 ఎకరాల్లో సాగు చేశారు. ప్రధానంగా ఈ సంవత్సరం వరుసగా అల్పపీడన ద్రోణులు, వర్షాల కారణంగా అధికంగా భూమిలో తేమశాతం పెరిగిపోయింది. దీనివల్ల పంట పొలాల్లో ఎక్కువ రోజులు నీటి నిల్వ కారణంగా వైరస్ కారకాలు పెరుగుతున్నట్లు అధికారులు చెప్తున్నారు.

వైరస్ రకాలు- వాటి లక్షణాలు

సాధారణంగా బొప్పాయి ఆకులపై రింగ్‌ల ఆకారంలో మచ్చలు, ఆకు ముడత పడడం, కాయలపై వలయాకార మచ్చలు కనిపిస్తే దీనిని రింగ్ స్పాట్ వైరస్ అని అంటారు. దీనివల్ల మొక్క పెరుగుదల ఆగిపోతుంది. దిగుబడులు తగ్గిపోతాయి. లీఫ్ కర్ల్ వైరస్ అనే రకంలో ఆకులు లోపలికి ముడుచుకుపోవటం, చిన్నవిగా మారడం, మొక్కలు చిన్నవిగా మారిపోతాయి. ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి, మొక్క పెరుగుదల తగ్గిపోవడాన్ని ఎల్లో మొజాయిక్ వైరస్ అని పిలుస్తారు. ఈ వైరస్‌ల వ్యాప్తికి వాతావరణ పరిస్థితులు అంటే అధిక ఉష్ణోగ్రత ఉన్నా అధిక తేమ ఉన్నా రెండు కూడా వైరస్ వ్యాప్తికి కారణంగా మారతాయి. అలాగే నీటి తేమ వల్ల ఎక్కువగా వచ్చే తెల్లదోమ కారణంగానూ, ఇతర రకాల పురుగల వ్యాప్తి వల్ల వైరస్ సంక్రమించే ప్రమాదాలు ఉన్నాయి.

వైపాలెం నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం

మండలం	సాధారణ విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ ఏడాదిసాగు (ఎకరాల్లో)
ఎర్రగొండపాలెం	500	900
దోర్నాల	400	700
పుల్లలచెరువు	100	300
పెద్దారవీడు	150	400
త్రిపురాంతకం	300	500
మొత్తం	1,450 ఎకరాలు	2,800 ఎకరాలు

నివారణ చర్యలు

వైరస్ సోకిన మొక్కలను పీకివేసి కాల్చివేయాలి. అలాగే పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా దోమలను ఆ అట్టలవైపు ఆకర్షించేలా చేయవచ్చు.

ముఖ్యంగా వైరస్ సోకిన బొప్పాయి పొలంలో తప్పనిసరిగా పంట మార్పిడి చేసుకోవాలి. వైరస్ లక్షణాలు కనిపించగానే మొక్కలపై నీమాయిల్ పిచికారీ చేయాలి. అలాగే థియోమెథాక్సమ్, ఇమిడాక్లోప్రిడ్, డైమోథోయేట్ మందులను పిచికారీ చేయడం ద్వారా కొంతమేర అరికట్టవచ్చు. అధికంగా వైరస్ బారిన పడకముందే ఉద్యానవనశాఖ అధికారుల సూచనలు తీసుకుంటూ అవసరమైన మందులను పిచికారీ చేయడం మేలు.



వైపాలెం ప్రాంతంలో వైరస్ లక్షణాలతో కనిపిస్తున్న బొప్పాయి తోట





సూర్యాస్తమయం వేళ.. ఆకాశం సిందూరం

మధ్యాహ్నం ఎండలో వస్తున్న విద్యార్థినులు

సాయంత్రం కురుస్తున్న వర్షం



మారిన వాతావరణం పులకించిన జనం

ఒంగోలు నగరంలో ఆదివారం వాతావరణంలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వర్షం పడటంతో కొంతమేర చల్లబడింది. ఇక సాయం సంధ్యవేళకి ఆకాశం ఎర్రగా మారి సూర్యాస్తమయం నయన మనోహరంగా మారింది. దానిని చూస్తూ నగర ప్రజలు పులకించిపోయారు.

- ఒంగోలు, కల్చరల్

గండి చెరువు సమీపంలో పెద్దపులి సంచారం

భయాందోళనలో రైతులు
అప్రమత్తంగా ఉండాలన్న అటవీ అధికారులు

పెద్దదోర్నాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద బొమ్మలాపురం గండి చెరువు ప్రాంతంలో ఆదివారం పెద్దపులి సంచరించడం కలకలం రేపింది. నల్లమల అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గండి చెరువు పక్కనే వ్యవసాయ పొలాలు ఉన్నాయి. ఆ భూముల్లో వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనుల్లో భాగంగా ట్రాక్టర్‌పై వెళ్లగా కొండ అంచున సంచరిస్తూ పెద్దపులి వారి కంట పడింది. దీంతో భయాందోళనకు గురయ్యారు. కొందరు ధైర్యం చేసి మిగిలిన వారిని కేకలు వేయొద్దని వారిస్తూ సెల్‌ఫోనులో చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో దోర్నాల రేంజ్ అధికారి హరి స్పందించారు. తమ సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పెద్దపులి తిరిగిన ప్రాంతంలో పాద ముద్రలు గుర్తించి సేకరించారు. ఈ ప్రాంతం టైగర్ జోన్ పరిధిలో ఉందని, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చిరుత అడుగుజాడల పరిశీలన



చిరుత పులి అడుగుజాడలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

వెలిగండ్ల : వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువు, రాళ్ళపల్లి గ్రామాల పంట పొలాల్లో చిరుత పులి సంచారం వారం రోజుల్లో రెండోసారి కనబడటం కలకలం రేపింది. శనివారం రాత్రి పొలాల్లో సంచరిస్తున్న చిరుతపులి రోడ్డు దాటుతూ వాహనచోదకులకు కనిపించడంతో గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈక్రమంలో ఆదివారం బీట్ ఆఫీసర్ నవీన్ పంట పొలాల్లో చిరుత అడుగుజాడలను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ చిరుత పులి ఒకేచోట నివాసం ఉండదని, తరుచూ తిరుగుతుంటుందని తెలిపారు. గొర్రెలు, మేకలు, పశువులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. చిరుత పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులెవ్వరూ పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటుచేయొద్దని సూచించారు

శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా రమణమ్మ



కొమరోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా కొమరోలు మండల తాటిచర్ల గ్రామ పంచాయతీ హసనాపురం గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు, అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు సతీమణి బోనేని రమణమ్మను ప్రభుత్వం నియమించింది. రమణమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి నామీద ఉంచిన నమ్మకాన్ని చిత్తశుద్ధితో నెరవేరుస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బోనేని దంపతులు గిద్దలూరులోని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాచర్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆకవీడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని గిద్దలూరు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవై శేషగిరిరావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

'ఆటో డ్రైవర్ల సేవ'తో ఆర్థిక భరోసా

రాచర్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆ కుటుంబాల్లో ప్రభుత్వం వెలుగులు నింపింది. ఆటోలు నడుపుతూ పిల్లలను చదివించుకుంటూ కుటుంబాలను పోషించుకునే వారి సంఖ్య మండలంలో అధికంగా ఉంది. వీరి జీవనాధారం ఆటోలపైనే ఆధారపడి ఉంది. రోజంతా కష్టపడి ఆటో తోలుకుని వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటూ పిల్లలను చదివించుకుంటూ ఆటోవాలాలు జీవిస్తున్నారు. చాలీచాలని ఆదాయంతో వారి మనుగడ కష్టతరంగా మా రింది. ప్రజా ప్రభుత్వం తాజాగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం అమలు చేసిన తర్వాత ఆటోలకు గిరాకీ తగ్గింది. ఆటోల్లో మహిళలు ఎక్కేవారి సంఖ్య తగ్గిపోయింది. దీంతో మరింత ఆర్థిక కష్టాలు ఎదురయ్యాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం దసరా కానుకగా ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా డ్రైవర్లకు రూ.15వేలను శనివారం అందజేసింది. ఈ పథకం అమలుతో నిరుత్సాహానికి గురైన ఆటో డ్రైవర్లు ఉత్సాహంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న రాచర్ల ఆటో డ్రైవర్లు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని రాచర్ల మండల ఆటో డ్రైవర్లు ఆదివారం కలిశారు. టీడీపీ మండల నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, చప్పిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిద్దలూరు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వారు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆటోను అమ్మేయాలనుకున్నా



ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి రాగానే ఆటోలకు మహిళా ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. ఏం చేయాలో తెలియక ఆటోను అమ్ముకోవాలని అనుకున్నాను. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవ పథకం ద్వారా రూ.15వేలు ఇవ్వడంతో ఆర్థిక భరోసా లభించింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

\- షేక్ ఖాదర్, ఆటో డ్రైవర్

ఆటోయే ఆధారం



ఆటో మీదనే ఆధారపడి జీవనం సాగిస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నాను. ఉచిత బస్సు ప్రయాణంతో బాడుగలు లేక ఆటోను మూలన పడేశాను. ప్రస్తుత ప్రభుత్వం రూ.15వేలు అందించి తిరిగి ఆటో వృత్తిని కొనసాగించుకునేలా చేసింది. ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

\- జీడిపల్లి బ్రహ్మయ్య, ఆటో డ్రైవర్



పశువైద్యశాలలో వ్యాపారం చేస్తున్న వ్యక్తులు

పశు వైద్యశాలలో ప్రైవేట్ వ్యక్తుల వ్యాపారం

పట్టించుకోని అధికారులు

కంభం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణంలోని బోర్డు స్కూల్ సమీపంలో 8 సంవత్సరాల కిందట రూ.10లక్షలతో నిర్మించిన వైద్యశాలను ప్రారంభించకపోగా అందులో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు టెంట్ హౌస్‌ను అనధికారికంగా నడుపుతుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వివరాలలోకి వెళితే.. కంభం మండలం కంభం మేజర్ పంచాయతీలో అధిక శాతం మంది రైతులు, పశుపోషకులు ఉన్నారు. పంచాయతీలో వందలాది పశువులు ఉన్నాయి. ఈ పశువులకు ఏదైనా జబ్బు చేస్తే సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని కందులాపురం పంచాయతీ పరిధిలో ఉన్న పశువైద్యశాలకు ఎంతో వ్యయప్రయాసలకులోనై పశువులను తోలుకు రావాల్సి వస్తుంది. దీంతో పలువురు రైతులు విజ్ఞప్తి మేరకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.10లక్షలు నిధులు మంజూరు చేసి రైతులు అధికంగా ఉండే కంభం పట్టణంలో పశువైద్యశాలను నిర్మించింది. ఆ వైద్యశాలలో పశువైద్యాధికారిని నియమించి పశువులకు వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని ప్రయత్నం చేసేలోగా వైసీపీ అధికారంలోకి రావడంతో వైద్యశాల ప్రారంభానికి నోచుకోక అలంకారప్రాయంగా మిగిలిపోయింది. దీంతో చుట్టు పక్కల నివాసితులు వైద్యశాలలో బట్టలు ఆరవేసుకునేవారు. ఈ నేపథ్యంలో ఏడాది కిందట ప్రైవేట్ వ్యక్తులు పశు వైద్యశాలను ఆక్రమించి టెంట్ హౌస్‌ను అనధికారకంగా నడుపుతున్నారు. గతనెల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు పశువైద్యశాలను ప్రారంభించకుండా ప్రైవేటు వ్యక్తులు టెంట్ హౌస్‌ని ఎలా పెట్టారని, పంచాయతీ వారు ఎవరైనా బాడుగకు ఇచ్చారా అని ప్రశ్నించగా స్పందించిన ఈవోఆర్డీ విజయలక్ష్మి తాము ఎవరికీ ఎటువంటి అనుమతి ఇవ్వలేదని తక్షణం టెంట్ హౌస్‌ను ఖాళీ చేయించి ఎవరూ ఆక్రమించకుండా తాళం వేయిస్తానని చెప్పిన అధికారులు నేటికీ స్పందించకపోవడంపై రైతుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తక్షణం ప్రైవేటు వ్యక్తుల నుంచి వైద్యశాలను స్వాధీనం చేసుకోవడమేగాక పశు వైద్యాధికారిని నియమించాలని అధికారులను కోరుతున్నారు.

మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అమిరుల్లాఖాన్ మృతి



అమిరుల్లా ఖాన్

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గొర్లగడ్డ జామీయా మసీద్ వీధికి చెందిన పఠాన్ అమిరుల్లాఖాన్ (60) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. పఠాన్ అమిరుల్లాఖాన్ 8వ వార్డు కౌన్సిలర్‌గా, మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా పనిచేశారు. జీప్ స్టాండ్ డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నారు. 37ఏళ్లుగా రాజకీయాలలో తనదైన శైలిలో చురుకైన పాత్ర పోషిస్తూ అందరు మామా అంటూ ముద్దుగా పిలుచుకునే ఆయన మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఆయన స్వగృహం వద్ద ఉంచారు. వివిధ రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు, వివిధ కులసంఘాల నాయకులు, కార్మికులు, ట్రేడ్ యూనియన్ నాయకులు నివాళులర్పించారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

రూ.50 వేల నగదు స్వాధీనం

మార్కాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పోలీసులు ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తర్లుపాడు రోడ్డులోని ఓ బంకులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.50,040 స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తీగలేరు వాగులో మృతదేహం

చింతల అగ్రహారం గ్రామానికి చెందిన విద్యార్థినిగా గుర్తింపు



సునీత

పెద్ద దోర్నాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామచంద్రకోట గ్రామం సమీపంలోని తీగలేరు వాగులో బాలిక మృతదేహం కన్పించిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. మృతదేహం గుర్తించేందుకు వీలులేకుండా ముఖం అంతా చిదిమి కుళ్లి పోయింది. గమనించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మహేష్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. పరిసర గ్రామాలయిన రామచంద్రకోట, చింతల అగ్రహారానికి చెందిన పలువురిని విచారించగా చింతల అగ్రహారం గ్రామానికి చెందిన కోలా సునీత (17)గా గుర్తించారు. ఎస్ఐ మాట్లాడుతూ దూపాడు సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలో ఇంటర్ చదువుతున్న సునీత గతనెల 29వ తేదీ నుంచి కనిపించడం లేదని 1వ తేదీన తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు ఒండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

అంకాలమ్మకు పూజలు



తర్లుపాడు : శ్రీ అంకాలమ్మ తల్లి ఆదివారం జాతర వైభవంగా నిర్వహించారు. తర్లుపాడులోని ముదిరాజు కాలనీ వాసులు కుంకుమ బండ్లు కట్టి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు కుంకుమ బండ్ల వెనుకాల బోనాల ఎత్తుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో 41వ రోజు పండుగ

కొమరోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ అంకాలమ్మ, పోలేరమ్మ, శీతాలమ్మ, నాభిశిల, గమిడిరాయిని ప్రతిష్ఠించిన సందర్భంగా 41 రోజుల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవతా విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పోలేరమ్మ వద్ద వేటలను బలిదానం చేశారు. కార్యక్రమంలో గిద్దలూరు టీడీపీ నాయకుడు ముత్తుముల క్రిష్ణకిషోర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబారపు రామకృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి, చలిచీమల శ్రీనివాసచౌదరి, తిరుమరెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ తగ్గింపు వరం

15వ బ్లాకులో ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తగ్గిన జీఎస్టీ పేద, మధ్య తరగతి, రైతు వర్గాలకు వరమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. 15వ బ్లాకులో ఆదివారం సూపర్ జీ ఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని ని ర్వహించారు. ఇంటింటికీ తిరిగి జీఎస్టీ పాంప్లెట్‌లను ఎమ్మెల్యే నారాయణరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన కేంద్ర ప్రభుత్వానికి రూ.2 లక్షల కోట్ల మేర ఆదాయం తగ్గినా ప్రజల ప్రయోజనం కోసం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రజలకు రూ.8 వేల కోట్ల మేర లబ్ధి చేకూరనుందన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు ప్రయోజనాలు పొందుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా తాజాగా ఆటో డ్రైవర్‌లకు రూ.15వేల ఆర్థిక సాయాన్ని అందించినట్లు చెప్పారు. సుమారు 8 వార్డుల ప్రజలకు సంబంధించిన శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించామన్నారు. పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీంఖాన్, టీడీపీ నాయకులు షేక్ మౌళాలి, కొప్పుల శ్రీనివాసులు, కనిగిరి రమణ, సయ్యద్ గఫార్, బాబీ, యలమంద పాల్గొన్నారు.



జీఎస్టీ తగ్గింపుపై ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కందుల

అటవీ సంపదను కాపాడుకుందాం

పెద్దదోర్నాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అటవీ సంపదను కాపాడుకుందామని చింతల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ అన్నారు. మండలంలోని చింతల, తుమ్మల బైలు చెంచు గిరిజన గూడేలలో వన్యప్రాణుల వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. గిరిజనులకు వన్యప్రాణుల సంరక్షణ, తద్వారా జీవరాశులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌వో చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాసవీ మాతకు తులాభారం



తులాభార కాయిన్స్‌ను దక్కించుకున్న యూత్ సభ్యులు

గిద్దలూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవ రాత్రులు వైభవంగా ముగిశాయి. చివరి రోజు ఆదివారం పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో వాసవీ మహిళా మండలి ప్రతినిధులు శ్రీ కుసుమ హరనాథ ప్రాంగణానికి తీసుకుని వచ్చారు. అక్కడ అమ్మవారిశాల కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, ఇతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చిల్లర నాణాలతో తులాభార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు తులాభారంలో వేసిన చిల్లర నాణాలను దేవస్థాన కమిటీ వేలం వేయగా రూ.63116 పాటపాడి వాసవీ యూత్ సభ్యులు తులాభార నాణాలను చేజిక్కించుకున్నారు. కోటా వెంకటేశ్వర్లు అనే వ్యాపారి రూ.15వేలకు పాట పాడి అమ్మవారి లడ్డూను చేజిక్కించుకున్నారు. అమ్మవారి మూలవిగ్రహానికి, ఉత్సవ విగ్రహాలకు కట్టిన చీరలను వేలం వేయగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలంకార చీరల వేలం ద్వారా రూ.2.96లక్షలు వెచ్చించి పలువురు మహిళలు చీరలను దక్కించుకున్నారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సహ పంక్తి భోజనాన్ని ఏర్పాటు చేయగా సుమారు 3 వేల మంది కుటుంబీకులు పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాపుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో బలిజ సేవా సంఘం భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. గత టీడీపీ హయాంలో నియోజకవర్గంలో కాపు భవనాలు మంజూరు చేస్తే వైసీపీ వచ్చాక వాటిని నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో ఏడుగురు కాపులకు నామినేటెడ్ పదవులు కేటాయించామని, కాపుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాపు సంఘం నాయకులు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని పూలమాలలు, శాలువలతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బలిజ సేవా సంఘం అధ్యక్షుడు యగటీల రంగసుబ్బయ్య, శాంతిరామ్ ఆసుపత్రి అధినేత శాంతిరామ్, న్యాయవాది రామచందర్ రావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుప్పా రంగసాయి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, కాపు సంఘం నాయకులు పసుపులేటి శ్రీనివాసులు, అబ్బు ఓబయ్య, ఉలాపు బాలచెన్నయ్య, గజ్జలకొండ నారాయణ, కమతం శ్రీను, నారిశెట్టి వీరమ్మ, బెల్లంకొండ విజయలక్ష్మి పాల్గొన్నారు.

'చలో విజయవాడ' కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపు మేరకు ఈనెల 7వ తేదీన జరుగనున్న చలోవిజయవాడ కార్యక్రమ కరపత్రాలను ఫ్యాప్టో నాయకులు ఆవిష్కరించారు. యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఫ్యాప్టో జోన్ కన్వీనర్ సుబ్బరాయుడు, కోకన్వీనర్ యల్లా శ్రీనివాసులు, వై.వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగస్వామి తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డీఏలను, 11వ పీఆర్సీ అరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని ఏపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు.

అర్ధంతరంగా ఆగిన రైతుబజార్ నిర్మాణం

» గత వైసీపీ పాలకుల అసమర్థతే ప్రధాన కారణం

» కూటమి ప్రభుత్వం రాకతో కదలిక



అర్ధంతరంగా నిలిచిపోయిన రైతు బజార్

దర్శి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనం కోసం మార్కెటింగ్ శాఖ నిధులతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రైతుబజార్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. ఏళ్ల తరబడి మొండిగోడలు వెక్కిరిస్తున్నాయి. వైసీపీ పాలకుల అసమర్థతతో దర్శి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పథకాలు మూలనపడిన విషయం తెలిసిందే. రైతుబజారు కూడా గోడల స్టేజీలో నిలిచిపోయింది.

గత ప్రభుత్వం హయాంలో రూ.60 లక్షలతో 40 షాపులు నిర్మించే విధంగా నిర్మాణం చేపట్టారు. ఒక కాంట్రాక్టర్ టెండర్ ద్వారా పనులు దక్కించుకోగా, మరో వైసీపీ నాయకుడు ఆ పనిని సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. అరకొరగా పనులు చేసి బిల్లులు చేసుకోవచ్చనే ఉద్దేశంతో కొంతమేర పనులు చేశాడు. అధికారులపై ఒత్తిడి తెచ్చి రూ.25 లక్షలకు పార్టు బిల్లును తయారుచేయించి పంపారు. అప్పటికే వైసీపీ ప్రభుత్వం నిధులను పక్కదారి మళ్లించటంతో పార్టు బిల్లు నిధులు మంజూరు కాలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. వైసీపీ ప్రభుత్వంలో అలాగే నిలిచిపోయింది.

2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టు బిల్లు కోసం ప్రయత్నించారు. నాసిరకంగా పనులు చేశారనే విమర్శలు రావటంతో అధికారులు బిల్లు మంజూరు చేయలేదు. ఇప్పటికీ రైతుబజార్ నిర్మాణం అలాగే మధ్యలో నిలిచిపోయింది. పునాదులు కూడా సక్రమంగా వేయకపోవటంతో ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపునీరు రైతు బజార్ నిర్మాణం చుట్టూ చేరింది. రోజులు తరబడి పునాదుల చుట్టూ నీరు నిల్వ ఉండటంతో దెబ్బతినే ప్రమాదం నెలకొంది. సంబంధిత అధికారులు రైతుబజార్ నిర్మాణం గురించి పట్టించుకోలేదు. నిల్వఉన్న నీటిని కూడా పక్కకు మళ్లించే ప్రయత్నం చేయలేదు. దర్శి, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో అనేకమంది రైతులు పండ్లు, పూలు, కూరగాయలు పండిస్తారు. వారు పండించిన పంటలను రైతుబజార్‌లో గిట్టుబాటు ధరకు విక్రయించుకునేందుకు ప్రారంభించిన రైతుబజార్ మధ్యలో నిలచిపోవటంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతుల అవసరాలను గుర్తించి కూటమి ప్రభుత్వం నిలిచిన రైతుబజార్ నిర్మాణం పూర్తిచేసి, అక్కడ మార్కెట్ ఏర్పాటుకు వసరులు కల్పించాలని కోరుతున్నారు.

ముఖాముఖి

జాబ్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

టి.వెంకటరావు, ఏపీవో, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో 21 గ్రామ పంచాయతీల్లో ఎంత మంది జాబ్ కార్డులు కలిగి ఉన్నారు?

జవాబు: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో 28,947 మంది ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిఉన్నారు. వీరందరూ ఈకేవైసీ చేయించుకుంటేనే కార్డు ఉంటుంది. లేకుంటే ఇన్ వాల్యూడ్‌లో ఉంటుంది. ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలి.

ప్ర: ఉపాధి హామి పథకంలో అక్రమాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: అక్రమాలు జరగకుండా పని ప్రదేశం నుంచే ముఖహాజరు తీసుకుంటున్నాం. దీనిద్వారా అక్రమాలకు తావు ఉండదు.

ప్ర: ఉపాధి హామి పథకం ద్వారా ఏఏ పనులు చేపడుతున్నారు?

జ: ఉపాధి హామి పథకం ద్వారా మండలంలో 75 ఎకరాలు పండ్ల తోటలు సాగుచేసేలా చర్యలు తీసుకున్నాం. మండలంలో ఇంకుడు గుంతలు నిర్మాణం వేగవంతంగా జరుగుతుంది. ప్రతి పంచాయతీలో 25 ఇంకుడు గుంతలు నిర్మించుకొనే విధంగా చర్యలు తీసుకున్నాం.

ప్ర: మండలంలో ఎన్ని గ్రామ పంచాయతీల్లో గోకుల్ షెడ్లు మంజూరు చేశారు?

జ: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 52 గోకుల్ షెడ్లు మంజూరయ్యాయి.

దారికాచి వ్యక్తిపై దాడి

దొనకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పొలం వివాదం నేపథ్యంలో దారి కాచి వ్యక్తిపై కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటన ఆదివారం మండలంలోని రుద్ర సముద్రం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది.

అందిన సమాచారం మేరకు మండలంలోని వల్లపునేనిపల్లి గ్రామానికి చెందిన మంచాల నాగయ్య, అతని బాబాయి మంచాల కోటయ్య కుమారుల మధ్య గత కొద్దికాలంగా పొలం వివాదం నడుస్తోంది. ఈక్రమంలో నాగయ్య ఐదు నెలల క్రితం తన కుటుంబంతో మార్కాపురంలో నివాసం ఉంటున్నాడు. వ్యవసాయ పనులు చేసుకునే నాగయ్య తన ట్రాక్టర్‌తో రుద్రసముద్రం గ్రామం వద్ద పొలం పనులు ముగించుకొని తిరిగి వెళ్తున్నాడు. ఈసమయంలో మంచాల కోటయ్య కుమారులు రుద్రసముద్రం గ్రామ సమీపంలో దారికాచి మోటార్‌సైకిల్ రోడ్డుకు అడ్డుగా పెట్టారు. నాగయ్య ట్రాక్టర్‌ను నిలపగా అతడిపై కర్రలతో దాడి చేశారు. తలకు తీవ్రగాయాలైన నాగయ్య సొమ్మసిల్లి రోడ్డుపై పడిపోవటంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

రహదారిపై వెళ్లే వారు గమనించి 108కు సమాచారం అందించారు. మార్కాపు రం 108 సిబ్బంది హుటాహుటీన ఘటనాప్రదేశానికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న నాగయ్యకు ప్రథమ చికిత్స చేస్తూ మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించినట్లు సమాచారం.

పేకాట స్థావరంపై పోలీసుల ఆకస్మిక దాడి

» 14 మందిని అదుపులోకి తీసుకున్న ఎస్ఐ

కనిగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై ఆదివారం ఎస్ఐ టి.శ్రీరాం తన సిబ్బందితో ఆకస్మిక దాడిచేశారు. ఈసందర్భంగా 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..

కనిగిరి మండలంలోని యడవల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ వ్యక్తుల సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో మారువేషంలో వెళ్లి పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 11 వేల 470 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ శ్రీరాం తెలిపారు. తెలిపారు.

ఈసందర్భంగా ఎస్ఐ టి.శ్రీరాం మాట్లాడుతూ సంఘ వ్యతిరేక కార్యకలాపాలు సాగించే వారి వివరాలను తెలియజేయాలన్నారు. వివరాలు తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కోడిపందాలు, పేకాట, గంజాయి విక్రయాలు చేసే వారి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామంలో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే తప్పనిసరిగా పోలీస్‌లకు సమచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

హిందువుల్లో చైతన్యం తీసుకురావాలి

దొనకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): హిందువుల్లో చైతన్యం తీసుకురావాలని ఆనంద ఆశ్రమ ధర్మకర్త కాకర్ల బైరవానందస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఆశ్రమంలో జరిగిన విశ్వహిందూ పరిషత్ మార్కాపురం శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్ సనాతన ధర్మం కోసం ఎన్నో ధార్మిక కార్యక్రమాలు చేపడుతుందన్నారు.

అనంతరం హైందవ శంఖారావంలో ప్రకటించిన విధంగా ధర్మ రక్షణ, గుడి రక్షణ హిందూ ధర్మములపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నర్లా వెంకటరెడ్డి, కోటేశ్వరమ్మ, మంచా మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చేశక్తి ఉపాధ్యాయులదే!



మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు

» జేవీవీ నాయకుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు

కనిగిరి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులదేనని జేవీవీ జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు గయాజ్ అధ్యక్షతన ఆదివారం పట్టణంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజాన్ని మంచివైపు నడిపించ గలిగే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రశ్నించేతత్వం అలవాటు చేసినప్పుడే విద్యార్థులు ఉత్తమ లక్ష్య సాధకులవుతారన్నారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.విశ్వనాథ్ మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలను నిర్మూలించే ఉద్యమంలో ఉపాధ్యాయులు కీలకమైన పాత్ర వహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 40మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా విద్యాకమిటీ కన్వీనర్ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు చిన్నాజి, పాపారాయుడు, కేవీ రమణారెడ్డి, ఆదినారాయణ, భాస్కర్ నారాయణ, కొండమ్మ, మధు, అడ్వకేట్ చొప్పరపు వాసు, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో..



పీసీపల్లి: ఉపాధ్యాయుడు రమణయ్యను సత్కరిస్తున్న జేవీవీ నాయకులు

పీసీపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాయపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న స్వర్ణ రమణయ్యను ఘనంగా సన్మానించారు. జిల్లా జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రమణయ్యను ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో జేవీవీ జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు రమణయ్యకు అవార్డును అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జేవీవీ ఉపాధ్యక్షుడు గయాజ్, శ్రీనివాసరెడ్డి, పాపారాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ముండ్లమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా జనవిజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి తంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో త్రిమూర్తులు, గంగినేని అనుదీప్, గాలి వెంకటేశ్వర్లు, బొమ్మతోటి రాజా రమేష్, అద్దంకి లెవీప్రసాద్, గంగినేని అలేఖ్య తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలో గ్రంథాలయం ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దొనకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దొనకొండ పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ షేక్ నాగూర్‌షరీఫ్ తెలిపారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

టీడీపీ నేత శాగం కొండారెడ్డి మృతి



కొండారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న లలిత్‌సాగర్, రవి కుమార్, తాటికొండ శ్రీను, మేడగం వెంకటేశ్వరరెడ్డి తదితరులు



కొండారెడ్డి(ఫైల్)

తాళ్లూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, జిల్లా కార్యనిర్వక కార్యదర్శి శాగం కొండారెడ్డి (54) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. మండలంలోని వెలుగువారిపాలెంకు చెందిన కొండారెడ్డి టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. గత మూడు నెలలుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కొండారెడ్డి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, హర్షిణి కాలేజీ అధినేత గోరంట్ల రవికుమార్, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నివాళుల్పంచినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, నేతలు బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, రాచకొండ వెంకట్రావు, వెలుగు సుబ్బారావు, గొంది రమణారెడ్డి(సమర), వల్లభనేని సుబ్బయ్య, శివనాగిరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, కె.రామకోటిరెడ్డి, షేక్ కాశింసైదా, సీహెచ్ కోటయ్య, కె.రామకోటిరెడ్డి, పిన్నిక రమేష్, చందన, జి.లక్ష్మీనారాయణ, పోలంరెడ్డి రమణారెడ్డి, కె.రామయ్య, విద్యాసాగర్, వంగపల్లి నాగేశ్వరరావు, యాతం శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు. అలాగే, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైఎస్ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, శిద్దా సుధీర్, గుమ్మడి సాయి, రామా గోపి, బాచిన శ్రీను, తదితరులు నివాళులర్పించారు. కొండారెడ్డి ముగ్గురు కుమార్తెలు పాడెను శ్మశానంవరకు మోసుకుని వెళ్లి తండ్రి రుణం తీర్చుకున్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

తాళ్లూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగ సన్నిధిలోని గంగమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడుకున్నారు. తాళ్లూరుతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో సందడిగా మారింది. వాహనదారులు వాహన పూజలు చేయించారు. కొందరు భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకపూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్ర నామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌పి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న పువ్వాడి వెంకటేశ్వర్లు దంపతులు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరణ చేశారు. అనంతరం మహానైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించారు. గోశాలలోని గోమాతకు పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. ఈసందర్భంగా టీడీపీ పామూరు మండల మాజీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణ, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్రెడ్డి, ఈవో నరసింహబాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, భైరవకోనలోని త్రిముఖ దుర్గాంబా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జలపాతం వద్ద సందడి చేశారు.

పామూరు మండలం తూర్పుకట్టకిందపల్లిలో శ్రీఅభయాంజనేయ స్వామి దేవస్థాన సంప్రోక్షణ, ప్రత్యేక పూజకార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, డాక్టర్ గద్దె ఏడుకొండలు, టీవీకే సుబ్బారావు, నీరుకట్టు శ్రీనివాసులు, అల్లూరి ప్రసాద్, చెంచయ్య చౌదరి, బి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో భారీ వర్షం

ముండ్లమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. పులిపాడు, కెల్లంపల్లి, ఉల్లగల్లు, రెడ్డినగర్, లక్ష్మీనగర్, శ్రీనివాసనగర్, వేముల, కమ్మవారిపాలెం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పసుపుగల్లు, చింతలపూడి, వేములబండలో ఓ మోస్తరు వర్షం కురిసింది.

వలస కార్మికుల ఆధారాలు సేకరణ



వలస కార్మికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ కమలాకర్

ముండ్లమూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు వివిధ రకాల పరిశ్రమల్లో పని చేస్తున్నారు. ఈ కార్మికులు తమ ఆధారాలను సంబంధిత పోలీసు స్టేషన్‌లో అందజేయాలని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. ఆదివారం ముండ్లమూరు, చంద్రగిరి, సింగనపాలెం, వేంపాడు గ్రామాలకు వెళ్ళి వలస కార్మికులను గుర్తించి వారిని స్టేషన్‌కు తీసుకువచ్చారు.

ఈసందర్భంగా ఎస్ఐ కమలాకర్ మాట్లాడుతూ కుటుంబాల జీవనం కోసం ఇతర ప్రాంతాలకు వచ్చినప్పుడు ఎలాంటి ఆధారాలు చూపక పోవటం వల్ల ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు కొంత ఇబ్బందిగా ఉంటుందన్నారు. దీంతో వలస కార్మికులు ఆధార్ కార్డులు, కుటుంబసభ్యుల వివరాలు అందజేయాలన్నారు. ప్రతిఒక్కరూ పాస్‌పోర్టు ఫొటో ఇవ్వాలన్నారు. ఇక్కడికి తీసుకొచ్చిన యజమాని వివరాలు కూడా అందజేయాలన్నారు.



ఎంత వరదొచ్చినా.. ఇక అమరావతి సేఫ్

ప్రపంచంలోని ఐదు మేటి నగరాల్లో ఒకటిగా ఉండాలన్న ఆశయంతో పటిష్టమైన పునాదులతో రాజధాని అమరావతి నిర్మితమవుతోంది. అయితే దీనికున్న ఒకే ఒక సమస్య వరద ముంపు.. ఇదే సమస్యను నగరానికి చాలా పెద్ద అనుకూలాంశంగా మార్చుకుంటూ పక్కా ప్రణాళికలతో అమరావతిని మలుస్తున్నారు. సంక్షోభాలను కూడా అనుకూలాంశాలుగా మార్చుకుని ముందుకు సాగడం చంద్రబాబు పద్ధతి. ఇప్పటి వరకు కొందరు ఏదైతే ముప్పని అంటున్నారో అదే సమస్యను రాజధానికి ఓ పెద్ద వరంగా మార్చి చూపేందుకు అద్భుతమైన ప్రణాళికను బ్రహ్మాండంగా ఆయన అమలు చేస్తున్నారు.


నీరుకొండ వద్ద భారీ జలాశయం నిర్మించనున్న ప్రాంతమిదే

- తొలిదశలో రూ. 1,237 కోట్ల వ్యయం
- మొత్తం ఆరు రిజర్వాయర్ల ఏర్పాటు
- వరద జలాలను ఎత్తిపోసేందుకు మూడు లిఫ్టులు
- 2026 చివరి నాటికి తొలిదశ పనులు పూర్తి
- సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్

రెండుదశల్లో వరద మళ్లింపు పథకాలు

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

అమరావతికి కొండవీటివాగు ముంపు సమస్య చాలా తీవ్రమైంది. దీంతోపాటే పాలవాగు, కొట్టేళ్లవాగు తదితరాలు కూడ. వీటిలో ప్రధానమైన కొండవీటి వాగు పేరేచర్ల కొండలలో పుట్టి 28 కి.మీలు ప్రయాణించి ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా హెడ్ రెగ్యులేటర్ స్లూయూస్‌ల వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. ఈ వాగు పరీవాహక ప్రాంతంలో ఎక్కువ భాగం ప్రస్తుత రాజధాని అమరావతిలోనే ఉంది. భారీ వర్షాల నేపథ్యంలో కొండవీటి వాగు నుంచి వరద నీరు వచ్చి ఎగువ కృష్ణా నదిలో కలుస్తుంది. కృష్ణానదికి వాగుకు మధ్య లాకులు ఉన్నాయి. కొండవీటి వాగు వరద నీరు నదిలోకి వెళ్లేందుకు ఈ లాకులను ఎత్తడంతో నీరు నదిలోకి మళ్లిపోతుంది. కానీ...ఇదే సందర్భంలో కృష్ణానదికి పైనుంచి వరద నీరు మూడు లక్షల క్యూసెక్కులకు మించి వచ్చిందంటే వరదనీరు కొండవీటి వాగులోకి విరుచుకుపడుతుంది. కొండవీటి వాగులో నిత్యం గుర్రపుడెక్కాకు, తూటికాడ ఏపుగా పెరుగుతూ పూడిక వేస్తుంటాయి. దీంతో వాగులో నీరు ముందుకు ప్రవహించడం కష్టసాధ్యమై కట్టలు తెగి సమీప ప్రాంతాలను ముంచెత్తుతుంది. పాలవాగు కూడ కృష్ణాయపాలెం వద్ద ఇతర వాగులతో కలిసి వచ్చి కొండవీటి వాగులో కలుస్తుంది. ఈ సమస్యను

(మిగతా 6లో)


పెనుమాక వద్ద నిర్మించనున్న జలాశయ ప్రాంతమిదే


నెక్కల్లు-పిచ్చుకలపాలెం మధ్య నిర్మిస్తున్న గ్రావిటీ కెనాల్ (రెండోదశ పథకంలోనిది)

నెదర్లాండ్స్ విధానంతో ముందుకు

ప్రధానంగా ఎగువ కృష్ణలోకి వాగు వరద నీటిని లాకుల ద్వారా తరలించడమన్నది అసాధ్యమన్న సంగతిని సీఎం చంద్రబాబు గుర్తించారు. అందుకే ఈ సమస్యను గురించి నిపుణులతో సమగ్రంగా అధ్యయనం చేయించి దీనికి నెదర్లాండ్స్ విధానాలే అసలైన పరిష్కార మార్గాలుగా తేల్చేశారు. ప్రస్తుతం చిందరవందరగా ఉన్న వాగులు వంకలను ఓ క్రమపద్ధతిలో ప్రవహించేలా చేసి కొత్త ప్రవాహ రూపాలనిస్తూ వాటిని మధ్యమధ్యలో బ్యాలెన్స్‌డ్ రిజర్వాయర్లతో అనుసంధానించేలా నెదర్లాండ్స్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రాజధాని అమరావతి నీటి అవసరాలు తీరేలా వరద జలాలను వృథా పోనివ్వకుండా వాటన్నింటిని రిజర్వాయర్ల రూపంలో నిల్వచేసి భూగర్భ జలాలు పెరిగేలా.. రిజర్వాయర్లను ఒకదానితో ఇంకోటి అనుసంధానిస్తూ ఓవర్‌ఫ్లో అయ్యే నీటిని తరలించేలా ప్రణాళికలను రూపొందించారు. కాలువలను సుందరీకరించి వాటి తీరాలలో పార్కులు, రిసార్టులు వంటి వాటిని ఏర్పాటుచేయడం, కాలువల్లో నావిగేషన్ సౌకర్యాలను కల్పించడం వంటి చర్యలతో పర్యాటకాభివృద్ధి జరిగి వాటి నిర్వహణకయ్యే ఖర్చులను సునాయాసంగా రాబట్టేలా పథకం వేశారు.

అనుసంధానంగా హైవేలు

నిజాంపట్నం పోర్టు కనెక్టివిటీకి గ్రీన్‌ఫీల్డ్ హైవే

1 రూ.1400 కోట్ల అంచనాతో ఎలైన్‌మెంట్ సిద్ధం 1 కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదన 1 వినుకొండ-గుంటూరు, తెనాలి-చినకాకాని, నారాకోడూరు-ఎన్‌హెచ్-16లకూ..

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని జిల్లా కేంద్రమైన గుంటూరుతో, నిజాంపట్నం పోర్టుతో మరిన్ని ప్రాంతాలు అనుసంధానమయ్యేలా.. వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వచ్చేలా.. ఎగుమతులు, దిగుమతులుకు మార్గం సుగమం చేసేలా హైవేలకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ప్రతిపాదనలను రూపొందించింది. ఈ క్రమంలో నిజాంపట్నం పోర్టుని జాతీయ రహదారులతో అనుసంధానం చేసే ప్రాజెక్టును కేంద్రానికి ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. నారాకోడూరు నుంచి నిజాంపట్నం వరకు నిర్మించే నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎలైన్‌మెంట్ రూపకల్పన జరిగింది. అయితే కేంద్రం ఆమోదించిన తర్వాతనే దానిని పోర్టల్‌లో అప్‌లోడింగ్ చేసి భూసేకరణ ప్రక్రియని ప్రారంభిస్తామని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. దీనివల్ల నిజాంపట్నం పోర్టుకు ఎగుమతులు, అక్కడికి



దిగుమతులు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ప్రతిపాదిత పోర్టు కనెక్టివిటీ ప్రాజెక్టు అమరావతి రాజధాని ఔటర్ రింగురోడ్డుతో పాటు ఎన్‌హెచ్-16కి కూడా లింకవుతుంది. పోర్టుల అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిజాంపట్నం పోర్టుని కూడా అభివృద్ధి చేస్తోన్న విషయం తెలిసిందే. అయితే ఈ పోర్టుకు ఇప్పటి వరకు సరైన కనెక్టివిటీ లేదు. వాన్‌పిక్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చి ఉంటే నిజాంపట్నం పోర్టుకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరేది. అయితే ఆ ప్రాజెక్టు సీబీఐ కేసులతో అటకెక్కింది. ఈ నేపథ్యంలో నిజాంపట్నం పోర్టుకు సరైన రోడ్డు కనెక్టివిటీని కల్పించడం ద్వారా మత్స్య ఉత్పత్తుల ఎగుమ తులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జాతీయ రహదారులను అనుసంధానిస్తూ రహదారి నిర్మాణం చేపట్టాలని ఎన్‌హెచ్‌ఏఐని కోరింది. ఆ మేరకు రూ.1400 కోట్ల అంచనాతో ఆ సంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. దీనికి కేంద్రం ఆమోదిస్తే ఎన్‌హెచ్ నంబరు వస్తుంది. ఆ తర్వాత భూసేకరణ, నిర్మాణ ప్రక్రియ ప్రారంభమౌతుంది.

మరో రెండు ప్రాజెక్టులూ..

మరో రెండు ప్రాజెక్టులను కూడా ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. అందులో ఒకటి చినకాకాని జంక్షన్ నుంచి తెనాలి వరకు ఆరు వరసల జాతీయ రహదారి. దీని పొడవు 17.4 కిలోమీటర్ల వరకు ఉంటుంది. మరొకటి నారాకోడూరు- ఎన్‌హెచ్ 16 సెక్షన్. ఇది ఐదు కిలో మీటర్ల దూరం పైగా ఉంటుందని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. అలానే వినుకొండ - గుంటూరు జాతీయ రహదారిని నాలుగు వరసలుగా అభివృద్ధి చేసే ప్రాజెక్టుని కూడా ప్రతి పాదించినట్లు పేర్కొన్నారు. దీనికి పరిపాలన అనుమతి రావాల్సి ఉందన్నారు. కేంద్రం నుంచి అ నుమతులు రాగానే అన్ని రోడ్డు ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామని అధికారులు తెలిపారు.

నిషేధిత జాబితాలో సాగు భూములు

- అధికారుల చుట్టూ కొంగపాడు రైతుల ప్రదక్షిణ

అద్దంకి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ భూమి పరిసర ప్రాంతాల్లోని రైతులకు చెందిన వ్యవసాయ భూములన్నీ నిషేధిత జాబితాలో చేరాయి. దీంతో దశాబ్ద కాలంగా రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని దక్షిణ అద్దంకి రెవెన్యూ పరిధిలో 1858 సర్వే నెంబరులో మొత్తం 39.88 ఎకరాల భూమి ఉంది. అందులో 5.52 ఎకరాలు మాత్రమే దేవదాయశాఖకు చెందినది. కాగా మిగిలిన భూమి కొంగపాడు రైతులది. అయితే ఈ మొత్తం భూమి నిషేధిత జాబితాలో చేరింది. 1566 సర్వే నెంబరులో 25.15 ఎకరాలు, 1806 సర్వే నెంబరు లో 16.66 ఎకరాలు, 1807 సర్వే నెంబరులో 15.98 ఎకరాలు, 1810 సర్వే నెంబరులో 2.50 ఎకరాలు, 1811 సర్వే నెంబరులో 6.30 ఎకరాలు, 1844 సర్వే నెంబరులో 6.58 ఎకరాలు భూమి ధర్మకుంటగా నమోదై నిషేధిత జాబితాలో చేరింది. ఇలా సుమారు 100 ఎకరాలకు పైగా భూమి నిషేధిత జాబితాలో చేరడంతో పదుల సంఖ్యలో రైతులు నిత్యం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దేవదాయశాఖకు చెందిన భూమిని సబ్ డివిజన్ చేయించకుండా దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పరిసర ప్రాంతాల్లోని భూములన్నీ నిషేధిత జాబితాలో చేరాయి. దీంతో క్రయ, విక్రయాలకు అవకాశం లేకుండా పోయి తాము ఇబ్బంది పడుతున్నట్లు రైతులు ఆందోళన చెందుతు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దేదాయశాఖకు చెందిన భూమిని సబ్ డివిజన్ చేసి నిషేధిత జాబితా నుంచి తమ భూములను తప్పించాలని కొంగపాడు రైతులు కోరుతున్నారు.

నేడు స్వచ్ఛతా అవార్డుల పంపిణీ


కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల్లో గతంలో ప్రకటించిన అవార్డులను సోమవారం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. జీబీసీరోడ్డులోని కమ్మజనసేవాసమితి కల్యాణ మండపంలో అవార్డుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అవార్డులు అందజేస్తారన్నారు. అవార్డులకు ఎంపికైన అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2న రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవార్డులను ప్రకటించిందన్నారు. రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లాకు ఒక అవార్డు వచ్చిందన్నారు. జిల్లా స్థాయిలో వివిధ విభాగాలలో 49 అవార్డులు వచ్చినట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు అధికారులతో పీజీఆర్ఎస్ అర్జీలపై సమీక్ష ఉంటుందన్నారు. అనంతరం నిర్వహించే కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమం కలెక్టరేట్‌తోపాటు ప్రతి రెవెన్యూ డివిజన్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలలో కూడా అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. బాధితులు తమ సమస్యలపై అర్జీలు అందజేసినా ఇప్పటికీ పరిష్కారం కాకపోతే 1100 నెంబరుకు కాల్ చేసి అర్జీ స్థితి తెలుసుకోవచ్చన్నారు.

రూ.15.74 లక్షల ఉపాధి నిధులు గోల్‌మాల్

- చినకొత్తపల్లి పూర్వ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

అద్దంకి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకొత్తపల్లిలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చినట్లు ఎంపీడీవో వరూధిని తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించి రూ.15,74,283 మెటీరియల్‌ను చినకొత్తపల్లికి చెందిన మానం మురళీమోహన్‌దాస్ సరఫరా చేశారు. ఇందుకు సంబంధించి 2021 సెప్టెంబరు 3న పంచాయతీకి ఆ మేరకు ప్రభుత్వం నుంచి నిధులు జమయ్యాయి. అయితే మురళీమోహన్‌దాస్‌కు బిల్లులు చెల్లించకుండా పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి, సర్పంచ్ గుజ్జుల మల్లికలు బ్యాంక్ నుంచి డ్రా చేసి సర్పంచ్ సోదరుడు చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించారు. దీంతో అప్పట్లో మురళీమోహన్‌దాస్ పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మురళీమోహన్‌దాస్ బిల్లుల చెల్లింపుపై మంత్రి రవికుమార్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలు దఫాలుగా విచారణ చేపట్టిన అధికారులు నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించి, చర్యలకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో బ్యాంక్ నుంచి డ్రా చేసిన రూ.15,74,283 పంచాయతీ ఖాతాకు జమ చేశారు. అయితే ఆ మొత్తానికి సంబంధించి వడ్డీ సహ చెల్లించాలని, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిపై చర్యలు తీసుకోవాలని మురళీమోహన్‌దాస్ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈ నేపథ్యంలో అప్పటి చినకొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి, ప్రస్తుతం ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం తక్కెళ్ళపాడు పంచాయతీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. పంచాయతీ బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదును మానం మురళీమోహన్ దాస్ తీసుకోవాలని, అందుకు సంబంధించిన వడ్డీని లెక్కించి సర్పంచ్ మల్లిక, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిల చేత జమ చేయించాలని ఆదేశాలు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. వడ్డీ చెల్లింపు విషయంలో ఎంత శాతంగా లెక్కిం చాలనే ఉన్నతాధికారుల నుంచి స్పష్టత తీసుకున్న తర్వాత పంచాయతీ ఖాతాలో జమ చేయించేం దుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



చినకొత్తపల్లి గ్రామ సచివాలయం

రేషన్ దందా.. రూ.కోటిన్నర

1 యథేచ్ఛగా బియ్యం తరలింపు 1 నెలవారీ రేట్లు ఫిక్స్ చేసిన మాఫియా 1 మొక్కుబడి తనిఖీలతో అధికారులు మమ 1 ప్రకటనలకే పరిమితమైన ప్రభుత్వ హెచ్చరికలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రేషన్ బియ్యం పక్కదారి పట్టడాన్ని సహించేది లేదు.. కఠిన చర్యలు ఉంటాయి.. అక్రమార్కులపై పీడీ కేసులు నమోదు చేయడానికి కూడా వెనకాడబోం.. అంటూ కొన్ని నెలలుగా ప్రభుత్వం ప్రకటిస్తోంది. అయితే ఇవేవీ రేషన్ బియ్యం దొంగలకు పట్టడంలేదు. పైగా దందాను వ్యవస్థీకృతం చేసే దిశగా వెళుతున్నారు. ప్రభుత్వం మారినా రేషన్ దందా విషయంలో గతానికి, ఇప్పటికీ పెద్దగా తేడా లేకపోగా ముడుపుల మొత్తాలు పెరగడం విస్మయపరిచేదిలా ఉంది. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న రేషన్ దందాలో అక్రమార్కుల సంపాదన అక్షరాల కోటిన్నర అని తెలుస్తోంది. ఇందులో చాలా వరకు నియోజకవర్గాల వారీగా ఒక్కరే ఈ దందా నడిపిస్తున్నారు. ఒక్కో నియోజకవర్గానికి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు రేటు ఫిక్స్ చేసీ మరీ ఈ అనధికార దందా నడుస్తోంది. దందా చేసేదెవరు అనే వివరాలు సదరు వ్యవస్థల దగ్గర సమగ్రంగా ఉంటాయి. కానీ అటువైపు కన్నెత్తి చూడరు. ముడుపుల పర్వంలో పాలక పార్టీ నేతాగణం మొదలుకుని అన్ని విభాగాలకు భాగస్వామ్యం ఉంటుంది. అప్పుడప్పుడు మొక్కు బడిగా ఒకట్రెండు చోట్ల తనిఖీలు నిర్వహించి మమ అనిపించడమినహాయిస్తే దానిని అరికట్టాలన్న చిత్తశుద్ధి కనిపించడంలేదు. జిల్లాలో గత రెండు నెలల వ్యవధిలో బియ్యం దందాపై నమోదు చేసిన కేసులు ఐదు కూడా లేకపోవడం వ్యవస్థల నిద్రావస్థకు అద్దం పడుతోంది. నిరంతర తనిఖీలు చేసి రేషన్ బియ్యం పక్కదారి పట్టడాన్ని అరికట్టాల్సిన వ్యవస్థలు, రాజకీయ ఒత్తిళ్లతో మొక్కుబడి తనిఖీలకే పరిమితమై మమ అనిపిస్తున్నారు. ఏకంగా నెల వారీ ముడుపులు చెల్లించడంలో వేలం నిర్వహించి మరీ రేటు ఫిక్స్ చేసిన వైనం విస్తుగొలిపేదిగా ఉంది. అధికార పార్టీ నేతల అండతో మాఫియా చెలరేగిపోతోంది. రేషన్ బియ్యం పక్కదారి పట్టించి సొమ్ము చేసుకునే వారిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తామనే ప్రభుత్వం మాటలు ఆచరణలోకి రావడం లేదు. పైగా గత ప్రభుత్వంలో ఈ దందా చేసిన వారే ఇప్పుడు జెండాలు మార్చి యథేచ్ఛగా బియ్యం తరలించి జేబులు నింపుకోవడం గమనార్హం.


చీరాల నుంచి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కారంచేడు సమీపంలో పట్టుకున్న పోలీసులు (ఫైల్‌ఫోటో)

ఏడాదిలో 120 వరకు 6ఏ కేసులు

గడచిన ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 120 వరకు 6ఏ కేసులు నమోదు చేశారు. 6ఏ కేసులు ఒకసారికి మించి ఉన్న వారు 15 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. 6ఏ నమోదు అనేది ఓ సాధారణ అంశంగా మిగిలిపోయిందే తప్ప రేషన్ ఆగడాలను అరికట్టడంలో వాటి పాత్ర నామమాత్రమే. గత ప్రభుత్వంలోనే రేషన్ అక్రమార్కులపై పీడీ యాక్టు ప్రతిపాదనలు చేశారు. అవీ ఆచరణలోకి రాలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా కొన్నాళ్ల క్రితం పీడీ యాక్టు అలజడి రేగింది కానీ పట్టాలెక్కలేదు.

పొరుగు జిల్లా సరిహద్దు వద్ద...

బాపట్ల జిల్లా నుంచి కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్న 720 బస్తాల రేషన్ బియ్యాన్ని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ దందాలో ఆరితేరిన ఒంగోలుకు చెందిన వ్యాపారి చీరాల కేంద్రంగా గత కొంత కాలంగా రేషన్ దందాను నిర్వహిస్తున్నారు. చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన బియ్యం కూడా అతడివేనని సమాచారం. సదరు వ్యక్తికి రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండడంతో వ్యవస్థలు సైతం సహకరిస్తున్నాయని తెలుస్తోంది. పర్చూరు నియోజకవర్గ పరిధిలో కారంచేడు మండల పరిధిలోని ఓ రైస్‌మిల్లు ఈ అడ్డగోలు దందాకు కేరాఫ్‌గా మారింది. జె.పంగులూరు కేంద్రంగా దందా మొత్తం జరుగుతున్నట్లు సమాచారం. బాపట్ల నియోజకవర్గానికి వచ్చేసరికి గతం లో రూరల్, పట్టణం ఇలా రెండుగా విభజించి దందా నడిచేది. కానీ ప్రస్తుతం అంతా రూరల్ పరిధిలోని ఓ రైస్‌మిల్లు కేంద్రంగానే జరుగుతున్నట్లు సమాచారం. ఆయా నియోజకవర్గాల పరిధిలో సేకరించిన బియ్యాన్ని నిర్వాహకులు తొలుత ప్రకాశం జిల్లా బాట పట్టించి అక్కడ నుంచి తమిళనాడుకు తరలిస్తున్నారు. రేషన్ బియ్యం సైక్లింగ్ కోసం ఎంపిక చేసిన రైస్మి ల్లులనే ఉపయోగిస్తూ గుట్టుచప్పుడు కాకుండా దందా నడిపిస్తున్నారు.


భవానిసెంటర్ దర్శి రోడ్డులో 15 రోజుల క్రితం దుస్థితి(ఫైల్ ఫొటో)

నాడు గోతులు.. నేడు మెరుగులు

అద్దంకి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్ గోతుల మయంగా మారిన రోడ్డుపై వాహన చోదకులు అల్లాడిపోయారు. వారి ఇబ్బందులను తీరుస్తూ.. గోతుల రోడ్డు స్థానంలో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో త్వరలో వాహన చోదకులకు గోతుల్లో ప్రయాణం నుంచి విముక్తి కలగనున్నది. పక్షం రోజుల క్రితం వరకు భవానిసెంటర్‌లోని దర్శి రోడ్డులో చిన్నపాటి వర్షం కురిసినా గోతులలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. దీంతో స్థానికులు సమస్యను మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదేశించడంతో మున్సిపల్ అధికారులు వెంటనే పనులు ప్రారంభించారు. 13 మీటర్ల వెడల్పు, 18 మీటర్ల పొడవుతో సుమారు రూ.6 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే సగం రోడ్డు పనులు పూర్తి కాగా క్యూరింగ్ పూర్తయిన తర్వాత రాకపోకలు పునరుద్ధరించి మిగిలిన భాగం పనులు పూర్తి చేయనున్నారు.


భవానిసెంటర్ దర్శి రోడ్డులో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

అవీ..ఇవీ..

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

మార్టూరు, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మార్టూరులోని విద్యానగర్‌లో మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు, మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని పెంచి పెద్దచేయాలని కోరారు. కార్యక్రమంలో జాష్టి సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, రావి అంకమ్మచౌదరి తదితరులు పాల్గొన్నారు.

కనకనాగవరపమ్మ దేవస్థానానికి కాసులపేరు బహూకరణ



అమ్మవారికి కాసులపేరు అందిస్తున్న దాతలు, భక్తులు

వేటపాలెం(చీరాల), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రావూరిపేటలో వేంచేసిన భక్తుల ఇలవేల్పు కనకనాగవరపమ్మ దేవస్థానానికి సంతరావూరు గ్రామానికి చెందిన పమిడి నాగరాజు, విజయలక్ష్మీ దంపతులు వెండి మీద గోల్డ్ కోటింగ్ 198.500 మిల్లీ గ్రాముల కాసుల పేరు బహూకరించారు. దీని విలువ సుమారు రూ.32 వేలు ఉంటుందని చెప్పారు. ఈవో పోతిని శ్రీనివాసరావు చేతులు మీదుగా అమ్మవారికి సమర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీరాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఏర్పడుతోందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రామకృష్ణాపురం, హస్తినాపురం, సాల్మన్‌సెంటర్, నవాబ్‌పేట, రామిరెడ్డినగర్, సిపాయిపేటలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఉదయం 8.30ని. నుండి మధ్యాహ్నం 12.30ని. వరకు వాడరేవు, పెర్లవారి పాలెం, బుర్లవారిపాలెం, కీర్తివారి పాలెం, పాపాయిపాలెం ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జయంతిపేట, జాన్‌పేట, ఉజిలిపేట, మరియ్మపేట ఐక్యనగర్‌లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

అంకమ్మ తల్లి ఆలయంలో పూజలు

యద్దనపూడి,(మార్టూరు)అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద వెలసిన శ్రీఅంకాలమ్మతల్లి దేవస్థానం అనంత వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేగాకుండా మహాశాంతియాగం నిర్వహించారు. గ్రామంలోని మహిళా భక్తులు అమ్మవారికి చీర, సారె, గాజులు, పూసలు, పసుపు, కుంకుమ, సారెలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి

- పోలీసుల అదుపులో 12 మంది జూదరులు

అద్దంకి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి సమీపంలోని గుండ్లకమ్మ ముంపు పరివాహక ప్రాంతంగా ఉన్న అటవీ భూమిలో ఆదివారం కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 4 పందెం కోడి పుంజులు, రూ.6 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి



మృతి చెందిన తిరుపతయ్య

అద్దంకి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని కలవకూరులో చోటుచేసుకొంది. గ్రామం సమీపంలో ఉన్న మేడగం సుబ్బారెడ్డి కి చెందిన షెడ్ వద్ద గొర్రెల కాపరిగా కట్టా తిరుపతయ్య(14) పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. నెల్లూరు జిల్లా బుచ్చి పట్టణంలో శాంతినగర్‌కు చెందిన తిరుపతయ్య ఆరు నెలలుగా సుబ్బారెడ్డి వద్ద గొర్రెల కాపరిగా ఉంటున్నాడు. ఆదివారం ఉదయం షెడ్ వద్ద ఉన్న దూడకు సమీపంలోని పొలంలో మేత కోస్తుండగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కు ఉన్న సర్వీసు వైరు గడ్డిలో ఉంది. గమనించకుండా తీగను కోయడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

మార్టూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మార్టూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నరసరావుపేటలోని డాక్టరు మాక్స్‌విజన్ కంటి వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డు ఉన్నవారికి అన్ని రకాలుగా కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవాలన్నారు.

ఎంత వరదొచ్చినా.. అమరావతి సేఫ్

(3వ పేజీ తరువాయి)

- శాస్త్రీయ పద్ధతిలో పరిష్కరిస్తే రాజధాని అమరావతి భద్రంగా ఉంటుంది
- కమాండ్ కంట్రోల్‌తో అంతా సవ్యంగా...

ఈ మొత్తం వ్యవస్థను అన్నీ వేళల్లో నిర్వహించేందుకుగాను ఏపీసీఆర్‌డీఏ నూతన భవనంలో ఏర్పాటు చేస్తున్న అత్యాధునికమైన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉపయోగపడనుంది. దీని ద్వారా రాజధాని ప్రాంతంలోని వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ఏ సమయంలో ఎంత వర్షం కురుస్తుంది... ఏ రిజర్వాయర్‌లో నీరెంతుంది... కాలువల్లో నీరు ఏ పరిణామంలో ఎంత వేగంతో ప్రయాణిస్తుందనే అంశాలకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని సాంకేతికంగా తెలుసుకుంటూ తదనుగుణంగా రిజర్వాయర్‌లను బ్యాలెన్స్ చేస్తూ ఎత్తిపోతల పథకాలను నిర్వహిస్తారు. దరిమిలా అమరావతి నగర వీధుల్లో చుక్కనీరు కూడ నిలిచే పరిస్థితి ఉండదు. పైగా అమరావతిలో ప్రజల నీటి అవసరాలను తీర్చడంలో ఈ రెండు రకాల ప్రణాళికలు ఎంతో అద్భుతంగా ఉపకరిస్తాయి.

దిగువ పరీవాహక ప్రాంతంలో తొలిదశ పనులు

రాజధాని అమరావతిని వరదల కోణంలో.... కొండవీటివాగు పరీవాహక ప్రాంతాన్ని ఎగువ పరీవాహక, దిగువ పరీవాహక ప్రాంతమనే రెండు భాగాలుగా వర్గీకరించారు. రాజధానికి అత్యవసరంగా ముందు దిగువ పరీవాహక ప్రాంతంలో వరద జలాలను క్రమబద్ధీకరించే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈ మొదటిదశ ప్రణాళికను అమలు చేసేందుకుగాను రూ.1,236.74 కోట్లను ఖర్చు చేస్తున్నారు. ఈ మేరకు సదరు పనులన్నింటిని ఎంవీఆర్ ఇన్‌ఫ్రా సంస్థ చేజిక్కించుకుని క్షేత్రస్థాయిలో పనులను ముమ్మరంగా నిర్వహిస్తుంది. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ పనులన్నింటిని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

రాత్రివేళల్లో ఆస్పత్రికి పోయేదెలా..!

- వీధి దీపాలు ఏర్పాటు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రోగులు





చిల్లచెట్ల మధ్య అలంకారప్రాయంగా ఉన్న విద్యుత్‌స్తంభాలు

పర్చూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, ఆరోగ్య సిబ్బంది అంధకారంలో ఆస్పత్రికి వెళ్లడానికి బిక్కుబిక్కు మంటున్నారు. పాత చెన్నై రహదారి నుంచి పర్చూరు 30 పడుకల ఆస్పత్రి వరకు మూడేళ్ల క్రితం సీసీ రోడ్లును ఏర్పాటు చేశారు. కానీ వీధిలైట్లను ఏర్పాటు చేయలేదు. దీంతో 24 గంటలు వైద్యసేవలు అందించే ఆస్పత్రికి రాకపోకలు సాగించే రోగులు, ఆరోగ్య సిబ్బంది కటిక చీకటిలో అవస్థలు పడుతున్నారు. మరో వైపు రహదారి ఇరువైపులా చిల్లచెట్లు, ముళ్లపొదలు పెరిగాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే మరింత ఆందోళన కలిగిస్తోంది. ఎప్పుడు ఎలాంటి విషపురుగుల నుంచి ఎలాంటి ముప్పు వాటిల్లుతుందోనని వైద్యసిబ్బంది సైతం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి లైట్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ప్రధాన విద్యుత్ లైన్ నుంచి నుంచి ఆస్పత్రి వరకు మరో వైరు ఏర్పాటు చేస్తేనే వీధి లైట్లు ఏర్పాటు చేయడం సాధ్యమవుతుంది. అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ పనులు చేపట్టే అవకాశం ఉన్నా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కొద్దిపాటి నిధులతో నిత్యం వందల సంఖ్యల రోగులు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డులో వీధి లైట్లు ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

గ్రానైట్ వాహనాల రాకపోకలతో రహదారికి పగుళ్లు





గంగపాలెంలో పగుళ్లిచ్చిన రహదారి

బల్లికురవ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపాలెం గ్రామ ప్రధాన వీధి పూర్తిగా ధ్వంసమైంది. అధిక లోడుతో గ్రానైట్ వాహనాలు తిరుగుతుండడంతో ఇలా రహదారి దెబ్బతిందని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో గ్రామానికి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. పదేళ్ల క్రితం ఈ రోడ్డును నిర్మించినప్పటికీ, ప్రస్తుతం మళ్లీ పునర్నిర్మించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదే మార్గంలో కొణిదెన గ్రామంలోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి నూతన రోడ్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పర్చూరులో భారీ వర్షం

- లోతట్టు కాలనీలు జలమయం
- అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు



నెహ్రూకాలనీలో రోడ్లపై భారీగా చేరిన వర్షపునీరు



పర్చూరు - చీరాల అర్‌అండ్‌బీ రోడ్డుపై నీరు

పర్చూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులో ఆదివారం కుండపోతతో కూడిన వర్షంతో రహదారులు జలమయం అయ్యాయి. వాగులు కాలువలను తలపించే విధంగా మారాయి. రోడ్లపై ఎక్కడ చూసినా వర్షపు నీరే దర్శనమిచ్చింది. లోతట్టు కాలనీలు, రోడ్లపై భారీగా నీరు చేరటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్రఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. పర్చూరు లోని నెహ్రూకాలనీ, ఇందిరాకాలనీ, అంబేడ్కర్ నగర్, లక్ష్మీపురం తదితర కాలనీల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, కాలువలపై అక్రమ కట్టడాలను ఏర్పాటు చేసుకోవటంతో మురుగు ముందుకు కదలక వర్షపు నీటితో పొంగి పొరలటంతో పరిస్థితి మరింత ఇబ్బంది కరంగా మారింది. పర్చూరు - చీరాల అర్‌అండ్‌బి రోడ్డులో భారీగా నీరుచేసి వాగును తలపించే విధంగా మారింది.

వెంపరాలలో వైద్యశిబిరం, పారిశుధ్య పనులు కొనసాగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎబెట్ పిచికారీ చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

అద్దంకి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాలలో ఆదివారం కూడా వైద్యశిబిరం, పారిశుధ్య పనులు కొనసాగించారు. ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన 'వెంపరాలను వెంటాడున్న విషజ్వరాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ, మోదేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా పారిశుధ్య పనులు, వైద్యశిబిరం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సర్పంచ్ వెంకాయమ్మ పాల్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో సైడ్ డ్రైన్లలో బ్లీచింగ్ చల్లించారు. ఎబేట్ పిచికారి చేయించారు. మోదేపల్లి పిహెచ్‌సీ వైద్యులు డాక్టర్ గొట్టిపాటి జయసింహా 72 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ సత్తార్, అర్జునరావు, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.లక్ష విలువైన వెండి వస్తువుల అపహరణ



ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

అద్దంకి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. రూ.లక్ష విలువైన వెండి వస్తువులు అపహరణకు గుర య్యాయి. స్థానికుల కథనం మేరకు రావిపాటి శేషగిరి రావు కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. అప్పుడప్పుడు శ్రీనివాసనగర్ వస్తూ ఉంటారు. ఈ క్రమంలో శేషగిరిరావు కుమారుడు మహేంద్ర 15 రోజుల క్రితం శ్రీనివాసనగర్ వచ్చి వెళ్లాడు. అయితే ఆదివారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో స్థానికులు గుర్తించి శేషగిరిరావుకు ఫోన్ చేశారు. ఇంటిలోని రెండు బీరువాల తలుపులు తెరచి అందులో ఉన్న సుమారు రూ.లక్ష విలువైన వెండి వస్తువులు అపహరణ కు గురైనట్లు గుర్తించారు. శుక్ర, శనివారాలలో రాత్రి సమయంలో చోరీ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

వీరయ్యచౌదరి హత్యకేసులో నిందితులపై రౌడీషీట్లు

- ఎస్పీ ఆదేశాల మేరకు 10 మందిపై ఓపెన్

ఒంగోలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్యచౌద రి హత్య కేసులో నిందితులుగా ఉన్న 10 మందిపై ఎస్పీ ఆదేశాల మేరకు తాలూకా పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్లు తెరిచారు. వీరిలో ప్రధాన సూత్రధారి అయిన ముప్పా సురేష్‌తో పాటు, ప్రధాన పాత్రధారి బి.వినోద్‌కుమార్, ఒంగోలు బాలాజీనగర్‌కు చెందిన మార్టూరి కిరణ్‌కుమార్, బలరాంకాలనీకి చెందిన సమీ ర్, నాగులుప్పలపాడు మండలం దాసరివారి పాలెంనకు చెందిన తోటా శ్రీనివాసరావు, అమ్మనబ్రోలుకు చెందిన వీరగందం దేవంద్రనా థ్ చౌదరి, ఆళ్ల సాంబశివరావు (సిద్ధాంతి), నె ల్లూరుకు చెందిన బెల్లంకొండ వెంకట్ గౌత మ్, ఓబిలి నాగరాజు, తువ్వ వంశీకృష్ణ ఉన్నా రు. వీరిపై నిరంతర నిఘా ఉంచుతున్నామని తాలూకా సీఐ విజయకృష్ణ తెలిపారు.

7న జిల్లాస్థాయి హాకీ జట్ల ఎంపిక

సంతనూతలపాడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మైనంపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఈనెల 7న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 ఉమ్మడి జిల్లా స్థాయి బాల, బాలికల హాకీ జట్ల ఎంపికలు జరగనున్నట్లు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి చింపారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 1-1-2007 తర్వాత జన్మించిన వారై ఇంటర్ సెకెండియర్ చదువుతూ ఉండాలని తెలిపారు. ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకుని ఈనెల7న ఉదయం 9 గంటలకు మైనంపాడు ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో రిపోర్ట్ చేయాలన్నారు.

ప్రతి యువకుడు సమాజసేవలో భాగం కావాలి





కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ నేతలు, హాజరైన కార్యకర్తలు

అద్దంకి, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ప్రతి యువకుడు ఆర్ఎస్ఎస్ విలువలను ఆచరణలో పెట్టి సమాజ సేవలో భాగం కావాలని ఆర్ఎస్ఎస్ విభాగ ప్రచారక్ సభ్యులు గౌతమ్ అన్నారు. ఆ సంస్థ శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అద్దంకి పట్టణంలోని గీతామందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ దేశఏకత్వం, సమాజ సౌభ్రాతృత్వంల కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సహ ప్రచార ప్రముఖ్ చంద్రశేఖర్, జిల్లా సేవా ప్రముఖ్ లక్ష్మణ్, గరికపాటి సుబ్బారావు, చామర్తి సత్యనారాయణ, కొణిజేటి సాయి, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి వాసుగురుస్వామి, బీజేపీ నేతలు పరచూరి శ్రీనివాసరావు, జాగర్లమూడి యలమందరావు, షేక్ కాలేషాబాబు విరాట్, ఈదా చిన్న శ్రీనివాసరెడ్డి, జువ్వి రాము, మంగమూరి సతీష్, తమ్మన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం... పొంచి ఉన్న ప్రమాదం



విశ్వభారతీ స్కూల్ రోడ్డులో విద్యుత్ తీగలకు అల్లుకున్న చెట్ల తీగలు

అద్దంకి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. అద్దంకి పట్టణంలోని వాసవినగర్‌లో విశ్వభారతీ స్కూల్ రోడ్డులో విద్యుత్ తీగలకు మొక్కల తీగలు అల్లుకున్నాయి. స్వాగత తోరణాలు మాదిరి అల్లుకుపోయి తీగలు వేలాడుతున్నాయి. వర్షాకాలం కావడంతో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకొనే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలకు అల్లుకున్న మొక్కలను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నిర్వాహకులు

అద్దంకిటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని పుట్టంరాజు కళాక్షేత్రంలో ఆదివారం సాహితీ కౌముది ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని చప్పిడి వీరయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు వఠ్యం సీతారామశాస్త్రికి 'పుట్టరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం-2025'ను పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అందించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తేలప్రోలు కృష్ణయ్యకు మైనంపాటి వీరరాఘవశర్మ మెమోరియల్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం -2025ను డాక్టర్ టి.వెంకటరావు అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు మారం కోటేశ్వరరావుకు 'కారసాని అంజిరెడ్డి మెమోరియల్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం-2025'ను కేవీ పోలిరెడ్డి అందజేశారు. బాపట్ల జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కరి కమలేశ్వరరావు, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు, సాహితీ కౌముది కార్యవర్గం సభ్యులు వీరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ యు. దేవపాలన, వారణాసి రఘురామశర్మ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి సాంత్వన

- వైద్యశాల వద్ద హెడ్ కానిస్టేబుల్ పరామర్శ
- బంధువులకు సమాచారం అందజేత



వృద్ధుడిని పరామర్శిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు

చీరాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యుల నిరాదరణతో చీరాల ప్రాంతీయ వైద్యశాల వద్ద అనాథగా పడి ఉన్న వృద్ధుడు బాషాఖాన్‌కు సాంత్వన చేకూరింది. 'ఆంధ్రజ్యోతి'లో 'ఆలనా పాలనా కరువై' శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు ఆయన్ను పరామర్శించారు. ఆహార పదార్థాలు, దుస్తులు అందజేశారు. పరిస్థితులు అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. దీంతో నేడు కుటుంబ సభ్యుల చెంతకు ఆయన్ను పోలీసులు చేర్చనున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- సుమారు 500 మందికి పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చీరాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. సుమారు 500 మంది ప్రజలు హాజరై పరీక్షలు నిర్వహించుకున్నారు. వీరిలో 60 మందికి శస్త్ర చికిత్సకు వైద్యులు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు, ఉచిత శిబిరాలు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని వీబీవీ సత్యనారాయణ, రాఘవేంద్రరావు, లలితకుమారి, శ్రీనివాసరావు, వల్లంపట్ల వెంకటేశ్వరరావు పర్యవేక్షించగా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ నేత్రాలయ సంయుక్తంగా ఎన్ఆర్ఐ దాతల ఆర్థిక సహకారంతో కార్యక్రమం నిర్వహించారు.

సర్వీస్ రోడ్డుపై నీరు నిలవకుండా చర్యలు

- కాలువ ద్వారా డ్రెయినేజీలోకి మళ్లింపు



ఎక్స్‌కవేటర్‌తో నీటిని మళ్లిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పంగులూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ముప్పవరం వద్ద 16వ నంబరు జాతీయరహదారి పక్కన సర్వీస్ రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు ఆదివారం చర్యలు చేపట్టారు. ఈ నెల 3న 'నీటమునిగిన సర్వీస్ రోడ్డుతో రాకపోకలకు ఇబ్బంది' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి గ్రీన్‌ఫీల్డ్ అధికారులు, స్థానికులు స్పందించారు. జాతీయరహదారికి పడమటివైపున సర్వీస్‌రోడ్డుపై నిలిచే వర్షపునీటిని సమీపంలోని డ్రైనేజ్‌లోకి చేరుకునేలా తూములు ఏర్పాటుచేశారు. జాతీయరహదారి ఆనుకుని ఉన్న సాయిబాబాగుడి, ఉన్నత పాఠశాల ఎదురుగా సర్వీస్ రోడ్డును ముంచెత్తుతున్న వర్షపు నీరు సమీపంలోని డ్రైనేజ్‌లోకి చేరుకునేలా పొలాలకు వెళ్లే డొంకలో తూముల ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నగదు జమ కాలేదా...?

- ఆటో డ్రైవర్లూ.. సచివాలయానికి వెళ్లండి !
- ఫిర్యాదుల స్వీకరణ... ఆపై ప్రత్యేక పోర్టల్‌లో రవాణాశాఖకు బదిలీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు అండగా నిలిచేందుకు 'ఆటో డ్రైవర్ల సేవలో..' అనే పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా 17,406 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.26 కోట్లను విడుదల చేసింది. అయితే జిల్లాలో వందల సంఖ్యల్లో అర్హత ఉన్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కింద రూ.15 నగదు ఇంకా వారి ఖాతాల్లో జమ కాలేదు. దీంతో వారిలో అసహనం నెలకొంది. ఈ క్రమంలోనే పథకానికి అర్హత సాధించిన లబ్ధిదారులు వారి పరిధిలోని సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తే... వారు వెంటనే స్పందించి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో కంప్లెయిట్‌ను రైజ్ చేస్తారు. ఆ ఫిర్యాదు నేరుగా రవాణాశాఖ కార్యాలయానికి చేరుతుంది. దీంతో రవాణా శాఖ అధికారులు అన్నీ పత్రాలను పరిశీలిస్తారు. లేని పత్రాలను జత చేయమని చెప్తారు. అనంతరం వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చూస్తారు. ఇంకెందుకు ఆలస్యం.. నగదు జమ కాని ఆటోవాలాలూ త్వరపడండి.

ఈ-క్రాప్ గడువు పొడిగింపు

- రైతులు సద్వినియోగం చేసుకుంటే సంక్షేమ ఫలాలు

ఉదయగిరి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సెప్టెంబరు నెలాఖరుతో ఈ- క్రాప్ నమోదుకు గడువు ముగియడంతో వేలాదిమంది అన్నదాతలు నమోదుకు దూరమయ్యారు. ఏ ఒక్క రైతూ నష్టపోకూడదని భావించిన ప్రభుత్వం గడువును ఈనెల 25 వరకు పొడిగించింది. అనంతరం రైతుసేవా కేంద్రాల్లో అర్హుల జాబితాను ప్రదర్శిస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.



ప్రతి ఖరీఫ్, రబీ సీజన్లలో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది చేపడుతుంటారు. వీటి ఆధారంగానే పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే బీమా వర్తింపచేసి పరిహారం అందజేస్తుంది. పంట రుణాలపై వడ్డీ రాయితీని భరిస్తుంది.

● నమోదు తప్పనిసరి

రైతులు ఈ-క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలి. జిల్లాలో వ్యవసాయ పంటలు 1,65,721 ఎకరాలు, ఉద్యాన పంటలు 1,18,180, సామాజిక వనాలు 24,737 ఎకరాలు చొప్పున మొత్తం 3,08,638 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు అధికారులు 2,46,727 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేశారు. ఇంకా 61,911 ఎకరాల్లో నమోదు చేయాల్సి ఉంది. ఖాళీగా ఉన్న భూములకు ఎలాంటి పంట సాగు చేయలేదని నమోదు చేస్తారు. వ్యవసాయ సహాయకులు రైతును పొలం వద్ద నిలబెట్టి ఫొటో తీసి యాప్‌లో పొందుపరుస్తారు. అనంతరం రైతు పేరు, పంట రకం, విస్తీర్ణం, సొంతమా... కౌలుకా... నీటి ఆధారమా... సేంద్రియమా... రసాయనమా...? ఆధార్, ఫోన్ నంబరు తదితర వివరాలన్నీ సేకరించి యాప్‌లో పొందుపరుస్తారు. ఆధార్ ఓటీపీ లేదా వేలిముద్రతో నమోదుకు అవకాశం కల్పిస్తారు.

ఈ నిషేధం ఇంకెంత కాలం?



ఎంకి పెళ్లి సుబ్బిచావు కొచ్చిందన్న చందంగా తయారైంది అర్హులైన ఫ్రీహోల్డ్ భూముల లబ్ధిదారుల పరిస్థితి. వైసీపీ హయాంలో పేదల పేరుతో భారీ భూదోపిడీ జరిగింది. అనర్హులకు కూడా ఫ్రీహోల్డ్ పేరుతో ప్రభుత్వ భూములను కట్టబెట్టారు. ఈ విషయమై కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ ప్రారంభించింది. గతేడాది ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు నెలల్లో రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. జిల్లాలో 98,785 ఎకరాలను ఫ్రీ హోల్డ్ కింద పట్టా భూములుగా మార్చగా, ఆ భూములన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్రీహోల్డ్ లబ్ధిదారుల అర్హతను రీవెరిఫై చేశారు. ఇందులో 14,834 ఎకరాల ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు ఫ్రీహోల్డ్ పేరుతో పట్టా హక్కులు కల్పించారని గుర్తించారు. మిగిలిన 83,951 ఎకరాల ఫ్రీ హోల్డ్ సక్రమంగానే ఉన్నట్లు నిర్ధారించారు. ఈ వివరాలన్నింటినీ సర్వే నంబర్లతో సహా ఆన్‌లైన్ చేసి ప్రభుత్వానికి పంపారు. కానీ ఏడాది గడిచినా ఇంత వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

- ఫ్రీహోల్డ్ భూములపై ఎటూతేల్చని ప్రభుత్వం



- ఏడాది క్రితం విచారణ పూర్తి... రిజిస్ట్రేషన్లకు బ్రేక్
- 14,834 ఎకరాల దోపిడీ జరిగినట్లు గుర్తింపు
- 83,951 ఎకరాలు సక్రమమేనని నిర్ధారణ
- రిజిస్ట్రేషన్లు జరక్క నిజమైన లబ్ధిదారుల ఇక్కట్లు

నెల్లూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): 'ఫ్రీ హోల్డ్' అక్రమాలపై ఎటువంటి నిర్ణయం తీసుకోవాలన్నదానిపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ మంత్రుల కమిటీ ఇంత వరకూ ఎటువంటి సిఫార్సులు చేయలేదు. అయితే ఈ ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ ప్రారంభమైనప్పటి నుంచి ఈ భూముల రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిలిపివేసింది. ఈ ప్రభావం నిజమైన లబ్ధిదారులపై పడుతోంది. ఏ భూములు అక్రమమో, ఏ భూములు సక్రమమో అన్నది రెవెన్యూ అధికారులు తేల్చాక కూడా ఇంకా అన్ని భూములపై నిషేధం కొనసాగిస్తుండడం లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. పట్టా హక్కులు కల్పించాక కూడా పేదలు వారి భూములను కుటుంబ అవసరాలకు విక్రయించుకోలేకపోతున్నారు. ప్రభుత్వం త్వరగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

● పేదల భూముల దోపిడీ

వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ పేరుతో ఒక జీవోను తీసుకొచ్చింది. దీని ప్రకారం ఎవరైతే అసైన్‌మెంట్ పట్టాలు పొంది ఇరవై ఏళ్లు గడిచి ఇప్పటివారే సాగు చేసుకుంటున్నారో.. అటువంటి వారికి ఆ అసైన్‌మెంట్ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తారు. అలానే చుక్కల భూములకు కూడా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. ఇలా గత ప్రభుత్వంలో జిల్లాలో 98,785 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. అందులో అసైన్‌మెంట్ భూములు 55,447 ఎకరాలు ఉండగా, చుక్కల భూములు 43,271 ఎకరాలు ఉన్నాయి. మరో 67 ఎకరాలు ఈనాం భూములున్నాయి. నిబంధనల ప్రకారం ఫ్రీహోల్డ్ చేసే సమయంలో గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంది. అప్పుడే లబ్ధిపొందుతున్న వ్యక్తి అర్హుడా.. కాదా..? అన్నది తేలిపోతుంది.

నాడు గ్రామసభలు ఏవీ?

కానీ ఎక్కడా గ్రామసభలు నిర్వహించలేదు. నిజమైన అసైన్‌మెంట్‌దారులు కాకపోయినా వేల మందికి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించి పేదల భూములు కట్టబెట్టారు. నాడు వైసీపీ నేతలు సాగించిన ఈ దోపిడీకి రెవెన్యూ అధికారులు పూర్తి సహకారం అందించారన్న ఆరోపణలున్నాయి. ఈ అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచారణకు ఆదేశించింది. గతేడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో ఫ్రీహోల్డ్ భూములపై తహసీల్దార్ల స్థాయిలో క్షేత్రస్థాయి విచారణ జరిగింది. ఈ సందర్భంగా 14,834 ఎకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసి అనర్హులకు దోచిపెట్టినట్లు తేలింది. ఇందులో అసైన్‌మెంట్ భూములు 14,553 ఎకరాలు ఉండగా, చుక్కల భూములు 281 ఎకరాలు ఉన్నాయి. ఈ వివరాలన్నింటినీ కలెక్టర్, జేసీ ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేశారు.

పరిశ్రమల అభివృద్ధికి సహకరించండి

హైవే పక్కన పొలాల రైతులతో సబ్ కలెక్టర్



మన్నేటికోట రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ హిమవంశీ

ఉలవపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఏర్పాటు కానున్న ఇండోసోలార్ కంపెనీకి భూసేకరణ విషయంలో సహకరించాలని కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ కోరారు. జాతీయ రహదారికి పక్కన ఉన్న పొలాల రైతులతో ఆదివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. హైవే నుంచి 300 మీటర్ల దూరంలో ఉన్న మన్నేటికోట గ్రామ ఉద్యాన రైతులకు సంబంధించిన 50 ఎకరాల భూముల ధరపై రైతులతో చర్చించారు. ప్రభుత్వ రేటును దృష్టిలో పెట్టుకుని, భూసేకరణలో భాగంగా ఎకరా సుమారు రూ.22 లక్షలు పలుకుతుందని సబ్ కలెక్టర్ రైతుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు రైతులు స్పందిస్తూ ఎకరాకు రూ. 50 లక్షల నుంచి రూ.కోటి వరకు ప్రభుత్వం ప్రకటిస్తేనే తాము భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తామన్నారు. ప్రభుత్వం తరుపున ఫైనల్‌గా రూ.30లక్షల వరకు ధర నిర్ణయించేలా చూస్తానని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ విషయమై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

కండలేరులో 57.55 టీఎంసీలు

రాపూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 58.46 టీఎంసీల నీరు ఉందని ఏఈ అనిల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 3600 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో, 650 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని అధికారులు పేర్కొన్నారు.

సోమశిలకు 9, 245 క్యూసెక్కుల వరద

అనంతసాగరం అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఆదివారం ఎగువ ప్రాంతాల నుంచి 9,245 క్యూసెక్కుల వరద వస్తున్న ట్లు అధికారులు తెలిపారు. దీంతో 72.508 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 2,600, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

నేటి నుంచి వెంకయ్య పర్యటన

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పూర్వ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు సోమవారం నుంచి ఈనెల 9వతేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.55 గంటలకు తిరుపతికి చేరుకుంటారని, సాయంత్రం 4 గంటలకు రోడ్డు మార్గాన వెంకటాచలానికి చేరుతారని పేర్కొన్నారు. ఈనెల 9వతేదీ వరకు స్వర్ణభారత్ ట్రస్టులో బసచేస్తారని, ఆ రోజు ఉదయం 11.30 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి బయలుదేరి తిరుపతి మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటారని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: జేఏసీ

ఉదయగిరిలో అడవి పందుల స్వైరవిహారం

- బెంబేలెత్తుతున్న ప్రజలు

కార్మికుల పనిగంటల పెంపును వ్యతిరేకిస్తాం : సీఐటీయూ

వివరాలు 5లో...

పెన్నాలో మునిగి ఒకరి మృతి

మరొకరి గల్లంతు ● జొన్నవాడ రేవు వద్ద ఘటన ● రెండు కుటుంబాల్లో విషాదం

నెల్లూరురూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెన్నాలో మునిగి ఓ నిండుప్రాణం బలైంది. మరొకరు గల్లంతయ్యారు. ఈ ఘటన జొన్నవాడ రేవు వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే... నెల్లూరులోని కొత్తూరు వద్ద నున్న శ్రీలంకకాలనీకి చెందిన గణేశన్ నరసింహ (19) అలియాస్ విశాల్ అమ్మమ్మ వాళ్ల ఊరైన నెల్లూరురూరల్ మండలంలోని దేవరపాళెంకు ఇటీవల వచ్చాడు. గ్రామానికి చెందిన బేల్దారి సంగవేలు కోటయ్య (24), విజయ్, ములుముడికి చెందిన లోకేష్‌లతో కలిసి ఆదివారం సాయంత్రం పెన్నాలో ఈతకొడదామని ఊరి నుంచి 2 కి.మీ దూరానున్న జొన్నవాడ రేవు వద్దకు వెళ్లారు. ఈత రాకపోయినా నరసింహ, కోటయ్య, లోకేష్ పాతవంతెన వద్ద నదిలోకి దిగారు. కొంత సేపటికి లోకేష్ బయటకు వచ్చేశాడు. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నరసింహ, కోటయ్య బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చిన విజయ్, లోకేష్ గాలింపు ప్రారంభించి, కేకలు వేశారు. సమీప వ్యక్తులు కొందరు వచ్చి వారుకూడా గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో దేవరపాళెం వాసులకు సమాచారం ఇచ్చారు. అక్కడ్నుంచి స్నేహితులు, గ్రామస్థులు సంఘటనా స్థలి వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ గుంజి వేణు, ఎస్సై లక్ష్మణరావు, వారి బృందం అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టగా నరసింహ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి కోటయ్య కోసం గాలింపు మొదలుపెట్టారు. అతని ఆచూకీ లభ్యం కాకపోవడం, చీకటిపడటంతో గాలింపును నిలిపివేశారు. సమాచారం అందుకున్న టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. కోటయ్య గాలింపు కోసం రిస్క్యూ బృందం కావాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు.




నరసింహ మృతదేహం, (ఇన్‌సర్ట్) నరసింహ (ఫైల్)



గల్లంతైన కోటయ్య (ఫైల్)

డేంజర్ స్పాట్ అది..

జొన్నవాడ రేవు వద్ద పాత వంతెన డేంజర్ స్పాట్‌గా ఉంది. ఈ ప్రాంతంలో సుడిగుండాలు ఎక్కువగా ఉంటాయన్నది నానుడి. ఇక్కడ ఈతకెళ్లిన అనేక మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి.

బతికించిన ఫోన్‌కాల్

నరసింహ, కోటయ్య, లోకేష్‌తో కలిసి విజయ్ కూడా ఈతకెళ్లాడు. ఈత కొట్టేప్రయత్నం చేస్తూ విజయ్‌ను కూడా నీళ్లలోకి దిగమని పిలిచారు. అప్పుడే అతడికి ఫోన్ రావడంతో మాట్లాడుతూ పక్కకు వెళ్లాడు. ఇంతలో నీట మునిగిన ముగ్గురు చేతులు పైకెత్తి కేకలు వేస్తూ కనిపించారు. స్వల్పంగా ఈత వచ్చిన లోకేష్ మాత్రం బయటపడ్డాడు.

రైల్వే ట్రాక్‌లపై ఫ్లైవోవర్ల కల నెరవేరేనా?

- గేటు వేస్తే.. బారులు తీరాల్సిందే !
- నగరంలో తీవ్ర సమస్యగా రైల్వే గేట్లు
- వంతెనల నిర్మాణంలో ముందుకు పడని అడుగు
- రోజురోజుకూ జఠిలమవుతున్న ట్రాఫిక్ సమస్య
- నగర ప్రజలకు ఉపశమనం ఎప్పటికో..?

నెల్లూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అదిగో పులి అంటే ఇదిగో తోక.. అన్న సామెతగా తయారైంది నెల్లూరులోని రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణం. ఒకటి, రెండు కాదు.. సుమారుగా ఏడేళ్లగా రైల్వే బ్రిడ్జిల నిర్మాణం మాటలే తప్ప ఆచరణ కనిపించడం లేదు. గతిశక్తి పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందటే ఈ రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణానికి బడ్జెట్‌ను కూడా కేటాయించింది. అప్పుడప్పుడు అధికారులు సమావేశాలు పెట్టుకొని వెళ్లిపోతుంటారు తప్ప ఫలితం మాత్రం కనిపించలేదు. ఈ ఏడాది జూన్‌లోనే బీవీనగర్, కొండాయపాలెం గేట్ల స్థానంలో బాక్స్ బ్రిడ్జిల నిర్మాణానికి టెండర్లు పిలుస్తామని అధికారులు ప్రకటించారు. కానీ, ఆ గడువు ముగిసి కూడా మూడు నెలలైంది. బీవీ నగర్, కొండాయపాలెం గేట్ల వద్ద బ్రిడ్జిలు నిర్మించాలంటూ కొన్ని దశాబ్దాల నుంచి ప్రజలు కోరుతున్నారు. నగరవాసుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణానికి సన్నాహాలు జరిగాయి. ఆ రెండు చోట్ల మట్టి పరీక్షలు కూడా చేశారు. వంతెన నిర్మాణానికి అవసరమైన మేరకు భవనాల తొలగింపునకు మార్కింగ్ కూడా ఇచ్చారు. కానీ ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఇటీవల మళ్లీ ఈ ప్రయత్నాల్లో కదలిక రాగా, ఈ దఫా ఫ్లైవోవర్లకు బదులుగా బాక్స్ టైప్ బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించారు. పోనీ ఆపైనా ముందుకు సాగుతోందా అంటే అదీ లేదు.

● వాహనాల బారులు

రాష్ట్రంలోనే నాలుగో అతిపెద్ద నగరం నెల్లూరు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో ముందు వరుసలో ఉంది. వ్యాపార, వాణిజ్య, పరిపాలనకు కేంద్రం. సుమారు పది లక్షల జనాభా ఉన్న నగరంలో ఇప్పటికీ తూర్పు, పడమర ప్రాంతాలకు వెళ్లాలంటే రైల్వే గేట్లు దాటాల్సిందే. ఒక్కసారి రైల్వే గేటు పడితే ఇక వాహనాలు బారులు తీరాల్సిందే. అందులోనూ ఇప్పుడు మూడో ట్రాక్ కూడా ఆపరేషన్‌లోకి రావడంతో ఒకసారి గేటు పడితే అర్ధగంటపాటు వాహనాలు నిలిచిపోతాయి. దీనివల్ల వాహనదారులకు సమయం వృథా అవుతోంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు నివాసముంటున్న నగరంలో ఇలాంటి దుస్థితి నెలకొనడంపై ప్రజల నుంచి తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.



కొండాయపాళెం గేటు వేయడంతో ఆగిన వాహనాలు

● ఆ ఒక్కటే దిక్కు..!

నగరంలో ప్రస్తుతం ఒకేచోట (అయ్యప్పగుడి సర్కిల్ వద్ద) రైల్వే ఫ్లైఓవర్ ఉంది. మాగుంట లేఅవుట్, రామలింగాపురం, విజయమహల్ గేటు, ఆత్మకూరు బస్టాండ్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు ఉన్నాయి. ఇక ప్రధానమైన బీవీనగర్, కొండాయపాలెం గేటు, విజయమహల్ గేటు, రంగనాయకుల పేట వద్ద మ్యాన్యువల్ రైల్వే గేట్లు ఉన్నాయి. వర్షాకాలం వస్తే నీరు రోడ్లపై పారుతుంది. ఆ సమయంలో రైల్వే అండర్ బ్రిడ్జిలు నీటితో నిండిపోతాయి. అప్పుడు రాకపోకలు సాగించడం కష్టమవుతుంది. ఆ సమయంలో అయ్యప్పగుడి ఫ్లైవోవర్ ఒక్కటే నెల్లూరు నగరానికి దిక్కవుతోంది. తూర్పు, పడమర ప్రాంతాల వాహనదారులు అటు ఇటు వెళ్లాలనుకుంటే కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సి వస్తోంది. మినీబైపాస్ రోడ్డు ప్రాంతమంతా వాణిజ్య పరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా రాకపోకలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.11,273
వెండి కిలో ధర	రూ. 1,51,500
వెండి ఒక గ్రాము	రూ.155.50

మంగళస్నానాలతో కోదండరామునికి పూజలు

కావలి రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కావలి మండలం చౌదరిపాలెంలోని కోదండరామస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంగళస్నా నాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం పం చసూక్త హోమం, లఘు పూర్ణాహుతి, సామూహిక లక్ష తులసి దళార్చన, తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసంత ర్పణ నిర్వహించారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఇంటి నిర్మాణానికి అనుమతులు ఉన్నాయి

గేటుకు ఫ్లెక్సీ ఏర్పాటుపై కావలిలో చర్చ

కావలి, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారు అన్ని అనుమతులూ పొందిన తర్వాతే నిర్మాణాలు చేట్టడం సహజం. ఒకవేళ ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మిస్తుంటే మున్సిపల్ అధికారులు పరిశీలించి.. ఈ ఇంటికి ఎలాంటి అనుమతులు లేవని బోర్డులు పెడతారు. ప్రభుత్వ స్థలమైతే 'ఇది ప్రభుత్వ స్థలం' అని బోర్డు పెట్టడం చూశాం. కానీ పట్టణంలోని ట్రంకు రోడ్డులో సత్యనారాయణస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ స్థలంలో నిర్మిస్తున్న ఇంటికి మున్సిపల్ శాఖ అనుమతులు ఉన్నాయని ఇంటి ప్లాన్‌తో సహా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆ ఇంటి ప్రహరీ గేటుకు కట్టారు. ప్రజలు ఆ ఫ్లెక్సీని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇళ్ల నిర్మించుకునేవారెవవరూ అనుమతులు ఉన్నాయని ఫ్లెక్సీలు కట్టరు కదా! మరి ఇదేమిటనే చర్చ సాగుతోంది. ఆ ఇంటి నిర్మాణాన్ని 13వ వార్డుకు చెందిన పుల్లారెడ్డినగర్ వాసులు అందరూ వ్యతిరేకిస్తూ, నిర్మాణం ఆపమని అధికారులను



ఇంటి గేటుకు నిర్మాణ ప్లాన్ ఫ్లెక్సీ

విన్నవించుకున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అయినా నిర్మాణ పనులు ఆగలేదు. అనుమతులు తీసుకుని ఇల్లు కట్టుకుంటుంటే ఎందుకు ఆపాలనే భావనతో 'అనుమతులు ఉన్నాయి' అంటూ నిర్మాణదారులు ఫ్లెక్సీ కట్టారు. నిజానికి అనుమతులు తీసుకుని నిర్మించుకుంటుంటే దానిని ఆపాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న ప్రతి ఒక్కరిలో కలగకమానదు. అయితే అసలు ట్విస్టు ఇక్కడే ఉంది. ఆ ఖాళీస్థలంలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు నిర్మాణం చేపడుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే సత్యనారాయణస్వామి దేవాలయం, పలు విద్యాసంస్థలు ఉన్న ఈ ప్రాంతంలో బార్ అండ్‌రెస్టారెంట్ పెడితే ప్రశాంతతకు భంగం కలగటమే కాక మహిళలకు రక్షణ కరువవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ బార్ అండ్ రెస్టారెంట్ వద్దని, నిర్మాణం ఆపాలని ఆ ప్రాంత ప్రజలు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నారు. అందుకే అక్కడ బార్‌అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయాలనుకున్న నిర్వాహకులు ఆ భవననిర్మాణానికి మున్సిపల్ శాఖ అనుమతులు ఉన్నాయంటూ ఏకంగా ఇంటి ప్లాన్‌తో కూడిన ఫ్లెక్సీని గేటుకు కట్టారు. దీంతో ఇలాంటి వింత ఎక్కడా చూడలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రాళ్లపాడు ప్రాజెక్టులో గుర్తుతెలియని మృతదేహం

లింగసముద్రం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో రాళ్లపాడు ప్రాజెక్టులో మృతదేహం ఉందని లింగసముద్రం ఎస్సై ఎం నారాయణకు సమాచారం వచ్చింది. దీంతో వెంటనే ఆయన సిబ్బందితో హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు వెళ్లి మృతదేహం కోసం గాలించారు. అయితే ప్రాజెక్టు పాత, కొత్త స్పిల్‌వేల మధ్యలో జనరేటర్ రూం వద్ద ఉన్న గోడ కింద భాగంలోని నీళ్లలో ఎండిన చెట్టు కొమ్మల మధ్యలో తేలియాడుతున్న మృతదేహాన్ని ఎస్సై నారాయణ గుర్తించారు. మృతునికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉండి, బ్లూ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. అయితే వంటిపై చొక్కా లేదు. మృతదేహాన్ని బయటకు తీసేందుకు ఎస్సై నారాయణ, సిబ్బంది చర్యలు చేపట్టారు. అయితే మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడు... ఇది హత్య లేక ఆత్మహత్య అనేది మృతదేహాన్ని బయటకు తీసిన తరువాత పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

నిబంధనలకు విరుద్ధంగా సిమెంట్ రోడ్డు నిర్మాణం

కందుకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండికందుకూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నీటి కుంటలో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారని సర్పంచు కుమ్మర బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బతుకు తెరువు కోసం ఏడేళ్ల క్రితం కొండికందుకూరు వచ్చి కుంట పోరంబోకులో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారిని అడ్డుపెట్టుకొని సీసీ రోడ్డు వేస్తున్నారని విమర్శించారు. ఉపాధి నిధులు దుర్వినియోగం చేయడంపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని సర్పంచు బ్రహ్మయ్య డిమాండ్ చేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు

కొండాపురం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరప్పాడు గ్రామంలో వెలసిన గ్రామదేవతలు పోలేరమ్మ, బంగారమ్మ అమ్మవార్లకు భక్తులు ఆదివారం పొంగళ్లు సమర్పించారు. గత రెండు వారాల చద్ది నైవేద్యాన్ని చెల్లించి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్ల వేళ గ్రామంలో సందడి నెలకొంది. కాగా అమ్మవార్లకు పొంగళ్లుపెట్టి మొక్కులు తీర్చుకుంటే మంచి జరుగుతుందని గ్రామస్థుల నమ్మకం.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: జేఏసీ

కందుకూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సంబంధించిన సమస్యలు పరిష్కారం అయ్యేవరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేయటం జరుగుతుందని జేఏసీ నేతలు తెలిపారు. కందుకూరు డివిజన్‌లోని విద్యుత్ ఉద్యోగుల సమావేశం జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఈనెల 6న విశాఖపట్నం, 8న తిరుపతిలలో కార్పొరేట్ ఆఫీసుల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహించి ఈనెల 13న ఛలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. 14న వర్క్ టూ రూల్ కార్యక్రమం ద్వారా నిరసన తెలపటం జరుగుతుందని, అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఈనెల 15 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లటం జరుగుతుం దని తెలిపారు. ఈసమావేశంలో విద్యుత్ శాఖలో వివిధ స్థాయిలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమాల గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న జేఏసీ నేతలు

మతం ముసుగులో రాజ్యాంగాన్ని మారుస్తున్నారు

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోహనరావు

కావలి (టౌన్) అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మతం ముసుగులో విద్వేషాలు రెచ్చగొట్టేలా రాజ్యాంగంలో మార్పులు తెస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలను విభజించి పాలిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు వంత పాడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు అమలు చేసేలా ప్రజా పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు నగేష్, జీ నాగేశ్వరరావు, శిక్షణా తరగతుల ప్రిన్సిపాల్ సుబ్బరామశర్మ, పట్టణ కార్యదర్శి పెంచల య్య, నాయకులు వెంకయ్య, మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, తిరుపాలు, శైలజ, సుశీల తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మోహనరావు

కార్మికుల పనిగంటల పెంపును వ్యతిరేకిస్తాం : సీఐటీయూ

ఉలవపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాలలో కార్మికుల పని గంటలను 8 నుంచి 13 గంటలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాట్రా సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం స్థానికంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వీఆర్ఏ, పీటీపీ కార్మికులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని, దీని కోసం చిరుద్యోగులంతా సమైక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా వీసం విజయ్ కుమార్, కో కన్వీనర్‌గా ఇందిరావతి, కోశాధికారిగా శ్రీదేవి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం ఫీడర్‌లో విద్యుత్ లైనుకు తగిలే చెట్లకొమ్మలు తొలగించటం కోసం సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని తాని కొండవారి కొష్టాలు, రామానాయుడు నగర్, వెంకటాద్రిపాలెం, కనిగిరి రోడ్డు సామిల్లు ఏరియా, బిలాల్‌నగర్, లంబాడిడొంక, దూబగుంట ప్రాంత విద్యుత్ వినియోగదారులు అసౌకర్యాన్ని గుర్తించాలని కోరారు.

కృత్రిమ అవయవాల కోసం దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సుదీక్షణ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఉచితంగా అందజేస్తున్నందున అవసరమైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదీక్షణ ఫౌండేషన్ నిర్వాహకురాలు విమల ఈ పరికరాలను ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాల కోసం నవంబరు 9న విజయవాడలోని లెనిన్ సెంటర్ దగ్గర గల అంబేడ్కర్ భవన్‌లో కొలతలు తీసుకోవటం జరుగుతుందని, ఈలోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8985356811 నెంబరులో సంప్రదించాలని కోరారు.

బోగోలులో మోస్తరు వర్షం

బిట్రగుంట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. మూడురోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం కురవడంతో కాస్త ఉపశమనం లభించింది.

జమునకు 'బెస్ట్ గురు' పురస్కారం

కావలి (టౌన్) అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్రం కరీంనగర్‌లోని ఎస్‌పీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా సంస్థ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కావలికి చెందిన ఉపాధ్యాయిని ఎం జమునకు నేషనల్ లెవెల్ 'బెస్ట్ గురు' పురస్కారం ప్రదానం చేశారు. సంస్థ నిర్వాహకులు గంగారపు మల్లేశం, రాజ రాజేశ్వరీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ తదితరులు జమునను గోల్డ్ మెడల్, శాలువ, ప్రశంస పత్రంతో సత్కరించారు.



బెస్ట్ గురు అవార్డు అందుకుంటున్న జమున

టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కావలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త ఆవుల లక్ష్మయ్య కుటుంబ సభ్యులను ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పరామర్శించారు. రూరల్ మండలం అన్నగారిపాలెం పంచాయతీ పెదనట్టుకు చెందిన ఆవుల లక్ష్మయ్య స్కూటర్‌పై వెళుతుండగా శనివారం అర్ధరాత్రి కావలి ట్రంకు రోడ్డులో ఆటో ఢీకొనడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రూరల్ మండలాధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణతో కలిసి గ్రామానికి వెళ్లి లక్ష్మయ్య మృతదేహానికి నివాళుర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అన్నివిధాల పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట కావలి ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీనుబాబు తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్‌లో పలువురు రక్తదానం

కావలి,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, ప్రజా నాయకుడు అన్నం సుబ్బారావు 13వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కావలి రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో పలువురు ఉపాధ్యాయులతో పాటు, అన్నం సుబ్బారావు కుటుంబ సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం వెంకట హనుమకుమార్ 68వ సారి, బండా వెంకట క్రిష్ణారెడ్డి 11వ సారి, అన్నం కిరణ్ 20వ సారి రక్తదానం చేయటం విశేషం.



గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయ ఆవరణలో ఉన్న గంగమ్మతల్లి ఆలయంలో చైర్మన్ పాముల రమణయ్య ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సకాలంలో వరాలు కురిసి గ్రామం పాడిపంటలతో కళకళలాడాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా అంబటి



జిల్లా అధ్యక్షుడి నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఈశ్వర్‌రెడ్డి

వింజమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా అంబటి ఈశ్వర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం నెల్లూరుజిల్లా బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బీజేపీని బలోపేతం చేయాలన్నారు. మండల అధ్యక్షుడు అంబటి ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మద్దూరి నాగేశ్వర్‌రెడ్డి, గని రమణయ్య, నాయకులు దాసరి ప్రసాద్, డి నారాయణ రెడ్డి, లెక్కమలేని రాజేష్‌నాయుడు, మల్లం కొండారెడ్డి, ఎం వెంకటరెడ్డి, ఎల్ రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కల్వర్టులు

- డ్రైనేజీ, వర్షపు నీరు వెళ్లక గ్రామస్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



దువ్వూరు పంచాయతీ కార్యాలయం పక్కన శిథిలమైన పంట కాలువ కల్వర్టు

సంగం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వర్టులు శిథిలావస్థకు చేరడంతో వర్షపు నీరు, డ్రైనేజీ నీరు వెళ్లక అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, శిథిలమైన కల్వర్టులను నిర్మించకుండా రహదారి పనులు చేస్తుండడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే డ్రైనేజీ నీటితోపాటు వర్షపు నీరు వెళ్లడం లేదని వాపోతున్నారు. దువ్వూరు గ్రామం మధ్యలో అన్నారెడ్డిపాళెం, మక్తాపురం గ్రామాలకు వెళ్లేందుకు తారు రోడ్డు ఉంది. ఈ రహదారి నిర్మించి చాలా సంవత్సరాలు కావడంతో శిథిలమై అధ్వానంగా తయారైంది. ఈ రహదారిలో పలుచోట్ల పొలాలకు సాగు నీరు ప్రవహించే కల్వర్టులు మూడు, డ్రైనేజీ నీళ్లతోపాటు వర్షపునీరు వెళ్ళేందుకు వేర్వేరు చోట్ల మరో మూడు కల్వర్టులు ఉన్నాయి. దువ్వూరు బ్రాంచి కెనాల్ నుంచి కల్వర్టుల గుండా రహదారికి తూర్పు వైపు ఉండే పొలాలకు పంట కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. అయితే ప్రస్తుతం బోరు పాయింట్‌లు అందుబాటులోకి వచ్చిన తరువాత పంట కాలువల్లో సాగునీరు సరఫరా కావడంలేదు. పంట కాలువలు డ్రైనేజీ కాలువలుగా ఉపయోగపడు తున్నాయి. కాగా, రహదారికి పడమరవైపు ఉన్న నివాసాల నుంచి డ్రైనేజీ నీళ్లతోపాటు, వర్షపునీరు రహదారి దాటి దిగువకు వెళ్లేందుకు అటు సాగునీరు, ఇటు డ్రైనేజీ కాలువలకు కల్వర్టులున్నాయి. ఇవి శిథిలమై అధ్వానంగా ఉన్నాయి. దీనివల్ల వర్షాకాలంలో రహదారికి పడమరవైపు ఉన్న మిట్టపాళెం, ఎస్టీకాలనీ, ముస్లీంపాళెం, గమళ్లపాళెం తదితర ప్రాంతాల నుంచి వర్షపు నీరు శిథిలమైన కల్వర్టుల్లో సరిగా పారక వర్షాకాలం ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

రూ. 2.25 కోట్ల నిధులు మంజూరు

అధ్వానంగా ఉన్న రహదారితోపాటు కల్వర్టుల మరమ్మతులకు రోడ్డు భవనాల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే కేవలం రహదారి మరమ్మతు పనులకు మాత్రమే రూ. 2.25 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కల్వర్టుల మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. దీంతో కాంట్రాక్టర్ రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో అధికారులు రోడ్డు పనులు చేస్తున్నారు. దీంతో దువ్వూరు రహదారి పడమర వైపు కాలనీలకు భవిష్యత్‌లో ముంపు తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముస్లీంపాళెం వద్ద దెబ్బతిన్న డ్రైనేజీ కల్వర్టు

కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

శిథిలమైన కల్వర్టుల విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజను వివరణ కోరగా దువ్వూరు రహదారికి పలుచోట్ల ఉన్న మూడు సాగునీటి కాలువలు, మరో మూడు డ్రైనేజీ నీరు పారే కల్వర్టులు శిథిలావస్థలో ఉన్న మాట వాస్తవమే. రోడ్డుతోపాటు కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. రోడ్డు నిర్మాణానికి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయి. కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో రోడ్డు పనులు చేస్తున్నాం.

పెళ్లికానుక అందజేత

ఉదయగిరి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేట గ్రామంలో షేక్ అహ్మద్, షరీఫా దంపతుల కుమార్తె షాజిన్ వివాహం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆదివారం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు జల్సాయాదవ్, హరీష్‌యాదవ్, గంగాధర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి, క్రమశిక్షణకు మారుపేరు ఆర్‌ఎస్‌ఎస్

సంగం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ శాఖ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా విభ్యావన ప్రచారక్ సావర్కర్ ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది కాలంలో సాధించిన విజయాలు, చేసిన సేవలు వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ అంటే క్రమశిక్షణ, దేశభక్తి, సేవకు మారుపేరని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ ఆపద వచ్చినా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ముందు ఉంటారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



సంగంలో ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాల గురించి వివరిస్తున్న ప్రచారక్ సావర్కర్

వాల్మీకి జయంతిని విజయవంతం చేయండి

ఆత్మకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని తిక్కన భవన్‌లో ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు వాల్మీకి జయంతిని నిర్వహించనున్నట్లు వాల్మీకి(బోయ) సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది అశ్వయుజ శుద్ధ పూర్ణిమ నాడు వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. కావున నెల్లూరు నగరంలో నిర్వహించే వాల్మీకి జయంతికి జిల్లాలోని రాజకీయ ప్రతినిధులు, ప్రముఖులు, వాల్మీకి బంధువులు, అన్ని కుల సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి హామీ సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాలి

వింజమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో 8290 జాబ్‌కార్డులలో 12402 మంది ఉన్నారు. వీరందరి నుంచి ఉపాధి హామీ సిబ్బంది ఈకేవైసీ సేకరిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలో ఏపీఓ, ఎంపీడీవో పర్యవేక్షించడం జరుగుతుందని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

అడవి పందుల స్వైరవిహారం

- బెంబేలెత్తుతున్న ప్రజలు



నాగులబావి వీధిలో పట్టపగలు చెత్తకుప్పల్లో అడవి పందులు

ఉదయగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా అడవిపందులు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అటవీ ప్రాంతం పట్టణానికి సమీపాన ఉండడం, అడవుల్లో నీటి చుక్క జాడ కనిపించకపోవడంతో పందులు పట్టణంలో సంచరిస్తున్నాయి. పగలు చెత్తకుప్పల్లో తిరుగుతూ ఆకలి తీర్చుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో ఏ వీధిలో చూసినా అడవిపందులు గుంపులుగుంపులుగా సంచరిస్తుండడంతో వాహనదారులు, ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులు పట్టణంలో సంచరించకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.